ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
మంగళవారం 8 జూలై 2025 | 5





గోదావరికి వరద వచ్చేస్తోంది!

- అధికారులను అప్రమత్తం చేసిన ఆర్డీవో మాధవి
- రానున్న మూడురోజుల్లో వరద పెరిగే అవకాశం



గౌతమీనదిపై రావులపాలెం-జొన్నాడ మధ్య పెరుగుతున్న వరద నీరు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

గోదావరికి వరద వచ్చేస్తోంది. రానున్న మూడు రోజుల్లో వరద ఉగ్రరూపం దాల్చనుందన్న జలవనరులశాఖ అధికారుల అంచనాలతో నదీ పరివాహక లంక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఇప్పటికే అనుసరించాల్సిన సహాయ పునరావాస కార్యకలాపాలపై కలెక్టర్ మహేష్‌కుమార్ జిల్లాయంత్రాంగంతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం గోదావరికి వరద ఉధృతి పెరుగుతోంది. ఎగువ నదీ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి ఉగ్రరూపం దాలుస్తోంది. రానున్న 48 గంటల్లో శబరీ నదికి భారీ వరద ప్రవాహం రానున్నట్టు అధికారులు అంచనా వేశారు. సోమవారం సాయంత్రానికి భద్రాచలంవద్ద 18 అడుగులు దాటి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. దీనికితోడు కోనసీమ జిల్లాలోని గౌతమీ, వశిష్ఠ, వైనతేయ, వృద్ధగౌతమీ నదీపాయల్లోకి గోదావరి ఎర్రనీరు ప్రవేశించడంతో నదీపాయల్లో జలకళ సంతరించుకుంది. వరదల నేపథ్యంలో పంట్లు దాటే సఖినేటిపల్లి-నర్సాపురం, కోటిపల్లి-ముక్తేశ్వరం రేవుల్లో అధికారులు జాగ్రత్తలు చేపట్టారు. నదీపాయల వెంబడి ఉన్న ప్రాంతాల అధికారులతో ఆర్డీవో కె.మాధవి ఐ.పోలవరం ఎంపీడీవో కార్యాలయంనుంచి పరిస్థితిని సమీక్షించారు.

రూ.788 కోట్లు.. ఏమయ్యాయి!

డీసీసీబీలో దారుణాలు





- మొండిబాకీల బెంగ
- 23 భారీ కుంభకోణాలు
- రూ.600 కోట్ల బకాయిలు
- రుణ డాక్యుమెంట్లు బోగస్
- అక్రమాలకు సహకారం
- గాలికొదిలేస్తోన్న అధికారులు
- అప్పులు రూ.4250 కోట్లు
- వార్షిక వడ్డీ రూ.250 కోట్లు
- సొసైటీల కంప్యూటరీకరణ

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) రానురాను తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతోంది. బోగస్ రుణాలు.. ఆర్థిక అవకతవకలు డీసీసీబీకి తలనొప్పిగా మారాయి. బ్యాంకును ఆర్థికంగా పటిష్ఠంగా ఉంచడంలో కీలకపాత్ర వహించాల్సిన సొసైటీలు అనేక అక్రమాలకు అడ్డాగా మారుతున్నాయి. బ్యాంకు సొమ్ములను దిగమింగే అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నాయి. దీంతో డీసీసీబీ సొమ్ము చాలా వరకు దొంగల పాలవుతోంది.అప్పుల రూపంలో ఇచ్చిన సొమ్ము వెనక్కు తిరిగి రావడం కలగానే మారుతోంది. ఇప్పటి వరకూ రూ.788 కోట్లు వస్తాయో రావో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఈ మొత్తంలో 23 కుంభకోణాలకు సంబంధించిన రూ.188 కోట్ల అవినీతి జరగ్గా.. వీటికి అనుసంధానంగా రూ.600కోట్ల రుణాలు వసూలు కాకుంగా గుదిబండలా మారాయి. ఇందులో వసూలు చేద్దామన్నా అసలు తీసుకున్న రుణ గ్రహీతలెవరో తెలియనంతగా దొంగ రుణాలు జారీచేసేశారు. ఈ తరహా అక్రమాలకు చెక్ పెట్టడం కోసం తాజాగా డీసీసీబీ పరిధిలోని అన్ని సొసైటీల రికార్డులను రూ.5.21కోట్లతో డిజిటల్ విధానంలో ఆధునికీకరించారు.

ఉమ్మడి జిల్లాలో 298 సొసైటీలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో కాకినాడలో డీసీసీబీ ఉంది. దీని కింద కాకినాడ జిల్లాలో 72 సొసైటీలు, తూర్పుగోదావరి జిల్లాలో 49, కోనసీమ జిల్లాలో 166, అల్లూరి జిల్లాలో 11 కలిపి మొత్తం 298 సొసైటీలు ఉన్నాయి. వీటి ద్వారా రైతులకు కావాల్సిన రకరకాల పంట రుణాలందిస్తారు. ఇప్పటి వరకు కేవలం కాగితాల ఆధారంగానే సొసైటీ రుణాలు జారీ చేసేవారు. ఈ క్రమంలో అనేక కుంభకోణాలు చోటుచేసుకున్నాయి. అనేక జిల్లాల్లో డీసీ సీబీల ఎన్‌పీఏలు రూ.150 కోట్ల వరకే ఉంటే ఉమ్మడి జిల్లా డీసీసీబీకి మాత్రం రూ.788 కోట్ల వరకు ఉండడంతో ఏ స్థాయిలో డీసీసీబీని అక్ర మార్కులు పిండేశారో అర్థం చేసుకోవచ్చు. ఈ మొండిబాకీలు ఎప్పటికీ రావనే ఆలోచనతో అధికారులు ఆశలు వదిలేసుకున్నారు.

23 కుంభకోణాలు..

డీసీసీబీ ద్వారా జారీ చేసే రుణాల్లో అసలు రైతులకు ప్రయోజనం చేకూరేది పిసరంత.. కొందరు నేతలు, అక్రమార్కులకు డీసీసీబీ బంగారుబాతులా మారింది. తమ పలుకుబడి, అధికారాలతో అనేక మంది నేతలు డీసీసీబీ రుణాలను బోగస్ వ్యక్తులకు ఇప్పించి వాటిని స్వాహా చేసేశారు. ఇప్పటివరకు 23రకాల కుంభకోణాలు జరగ్గా అందులో కాకినాడ జిల్లాలోని కిర్లంపూడి, ఏలేశ్వరం సహకార సొసైటీల పరిధిలోని స్కాంలే రూ.150 కోట్ల వరకు ఉన్నాయి. కిర్లంపూడి సొసైటీలో అవినీతే రూ.104 కోట్లు. సొసైటీ అధికారులు కొందరు అక్రమార్కులతో కుమ్మక్కై రుణాలు జారీ చేసి డబ్బునొక్కేశారు. అటు ఏలేశ్వరం సొసైటీకి సంబంధించి రూ.46 కోట్ల అవినీతి జరిగింది. జగ్గంపేట, గండేపల్లి సొసైటీల్లోను ఇదే తీరు. కోనసీమ జిల్లా అల్లవరం మండలం డి.రావులపాలెం, మలికిపురం మండలం లక్కవరం, తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం శ్రీరంగపట్నం, సీతానగరం మండలం వెదుళ్లపల్లి, తాళ్లపూడి మండలం రాగోలపల్లి తదితర సొసైటీల్లోను అవకతవకలు జరిగాయి. ఈ అవినీతి కారణంగా రూ.600 కోట్లు నిరర్థక ఆస్తులుగా మారినట్టు అధికారులు ఇటీవల గుర్తించారు. కుంభకోణాలకు తోడు ఆయా ప్రాంతాల్లో రైతుల పేరుతో జారీ చేసిన రుణాలు బోగస్‌గా ఉన్నట్టు గుర్తించారు. రికార్డుల్లో ఉన్న పేర్ల ఆధారంగా రికవరీకి ప్రయత్నిస్తుంటే అసలు ఆ పేరుతో ఉన్న రైతులే లేరు. దీంతో ఇప్పుడు ఏంచేయాలో అధికారులకు అర్థం కావడం లేదు. మొత్తం రూ.788కోట్లు నిరర్థకంగా మారడంతో అసలు అవి వస్తాయన్న నమ్మకం కూడా డీసీసీబీ అధికారులకు సడలిపోయింది. రూ.188 కోట్ల అవినీతికి సంబంధించి డబ్బులు మెక్కేసిన వారిని గుర్తించి ఆస్తుల రికవరీకి ప్రయత్నిస్తుంటే చాలామంది న్యాయస్థానాలను ఆశ్రయించి స్టేలు తేవడంతో అధికారులు మొండి బాకీల జోలికి వెళ్లడంలేదు.దీంతో డీసీసీబీ ప్రస్తుతం పీకల్లోతు ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయింది.

అప్పుల కుప్ప...

రాష్ట్రంలోనే ఉమ్మడి జిల్లాలో వ్యసాయ రుణాలు అధికంగా ఇవ్వడంలో ఒకప్పుడు డీసీసీబీకి పేరు.కానీ ఇప్పుడు బోగస్ రుణాలు, మొండిబాకీలతో అష్టకష్టాలు పడుతోంది. ఇచ్చిన రుణాల వసూళ్లలో అలసత్వంతో బ్యాంకు మనుగడే కష్టంగా మారింది. ఇటీవల గుర్తించిన లెక్కల ప్రకారం డీసీసీబీకి మొత్తం అప్పులు రూ.4250 కోట్లుగా తేలాయి. వీటికి సంబంధించి ఏటా వడ్డీని డీసీసీబీ రూ.250కోట్లు చెల్లిస్తుందంటే పరిస్థితి ఏ విధంగా దిగజారిపోయిందో అర్థం చేసుకోవచ్చు.

ఇకనైనా ఒడ్డున పడేనా..

ఉమ్మడి జిల్లా డీసీసీబీ పరిధిలో 298 సొసైటీలు ఉన్నాయి. ఇప్పటికీ పాతపద్ధతిలోనే పుస్తకాలపై లావాదేవీలు సాగుతున్నాయి. దీంతో బోగస్ రుణాల జారీ,నిధుల దుర్వినియోగం భారీగా ఉంటోంది. తద్వారా అనేక అక్రమాలకు తావిస్తోంది.ఈ నేపథ్యంలో సొసైటీల రికార్డులను పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ చేశారు. ఒక్కో సొసైటీకి రూ.1.75 లక్షల చొప్పున రూ.5.21 కోట్లతో ఆధునీకీకరించారు.ప్రతి లావా దేవీ కంప్యూటరీకరణ జరిగేలా చేశారు. దీంతో అక్రమాలకు ఏ మేరకు అడ్డుకట్టపడుతుందో చూడాలి.

కాల్వ కనిపిస్తే.. కబ్జాయే

రాజోలు మండలం తాటిపాక నుంచి కడలి వెళ్లే కెనాల్‌పై ఆక్రమణ

- జిల్లాలో ప్రధాన కాల్వల వెంబడి పెరుగుతున్న ఆక్రమణలు
- గుడి, విగ్రహాలు, పక్కా భవనాలతో ప్రవాహాలకు అడ్డుకట్ట
- కాల్వలు, డ్రెయిన్ల వెంబడి ఆక్రమణల తొలగింపునకు అధికారులతో కమిటీ

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ప్రధాన పంట కాల్వలు, డ్రెయిన్ల వెంబడి ఆక్రమణల సంఖ్య రోజురోజుకూ వేలాదిగా పెరిగిపోతున్నాయి. విగ్రహాలు, గుడులతో కాల్వల వెంబడి ప్రారంభిస్తున్న ఆక్రమణల పర్వం పక్కా భవనాల నిర్మాణానికి సైతం వెనుకాడడం లేదు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 240 కిలోమీటర్ల పొడవు కలిగిన వివిధ పంట కాల్వలపై పెరిగిపోతున్న ఆక్రమణల కారణంగా ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. రోడ్డును ఆనుకుని భవనాలు, గుడులు ఇష్టారాజ్యంగా నిర్మిస్తున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. పంటకాల్వలు,డ్రెయిన్ల వెంబడి పెరుగుతున్న ఆక్రమణలతో సాగునీరు, మురుగునీరు దిగే మార్గాలు కుంగి కుచించుకుపోవడంవల్ల శివారు ప్రాంతాల ప్రజలకు ముంపునీరు దిగే మార్గాలు లేకపోవడంతో వర్షాకాలం సమయంలో ఎన్నో సమస్యలకు ఈ ఆక్రమణలు కారణమవుతున్నాయి.

కాల్వ కనిపిస్తే కబ్జా చేసేయడమే..

బొబ్బర్లంక నుంచి ప్రారంభమయ్యే సెంట్రల్ డెల్టా ప్రధాన కాల్వల వెంబడి భారీ భవనాలే కట్టేశారు. ఆత్రేయపురం, రావులపాలెం, కొత్తపేట, మండలాల పరిధిలో అమలాపురం-బొబ్బర్లంక కెనాల్‌పై పక్కా భవనాలు నిర్మించారు. రావులపాలెంలో కాల్వ పక్కనే ఓ వైపు రక్షణ గోడ కూలిపోయినా వాటి చెంతనే సచివాలయ భవనాలు, చర్చిలు నిర్మించారు. మరికొంతమంది కాల్వగట్లను సైతం చిద్రం చేసి కొబ్బరిచెట్లు, పంటభూములు సాగు చేస్తున్నారు. రావులపాలెం నుంచి కొత్తపేట మీదుగా అమలాపురం వచ్చే కెనాల్ వెంబడి జరుగుతున్న వ్యాపారాలు అన్నీఇన్నీ కావు. పాత సామాన్ల వ్యాపారాలు, ప్లాస్టిక్ వ్యర్థాల కొనుగోళ్లు, భారీగా కొబ్బరి బుట్టలు ఏర్పాటు చేసి వాటిని సరుకు తయారుచేసే పనిలో కొందరు, మరికొందరు పక్కా భవనాలు నిర్మించి అద్దెలకు ఇచ్చుకుంటూ సొమ్ములు చేసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మందపల్లివద్ద కాల్వలో పిల్లర్లు వేసి ఆలయాలు నిర్మించారు. అమలాపురం నుంచి ముక్కామల వచ్చే రహదారిని ఆధునికీకరించడంతో కాల్వ వెంబడి ఆక్రమణల సంఖ్య అనూహ్యంగా పెరిగిపోయాయి. ఇలా మురమళ్ల, ముమ్మిడివరం, కాట్రేనికోన, తాటిపాక, రాజోలు, పి.గన్నవరం, మామిడికుదురుతో సహా కోనసీమవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోను అక్రమ కట్టడాల సంఖ్య వేలాదిగానే ఉన్నాయి. వీటిని తొలగించిరహదారులను విస్తరించడంతోపాటు రాజకీయాలకతీతంగా ఆక్రమణలు ప్రోత్సహించకుండా చర్యలు చేపట్టే క్రమంలో కొందరు జాతీయ, జాతి నాయకుల విగ్రహాలు, ఆలయాలను తొలగించాలని అధికారులు కార్యాచరణను సిద్ధం చేస్తున్నారు. రానున్నరోజుల్లో తాగునీరు, సాగునీటిని శివారు ప్రాంతాలకు అందించి.. డ్రెయిన్ల వెంబడి ఆక్రమణల తొలగించి ముంపునీరు దిగే మార్గం సుగమం చేయాలని రైతులు కోరుతున్నారు.

ఆర్డీవోల ఆధ్వర్యంలో కమిటీ

ఇటీవల జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ ప్రధాన పంటకాల్వలు, డ్రెయిన్లపై ఉన్న ఆక్రమణలు తొలగించడానికి అధికారులతో ఆర్డీవోల ఆధ్వర్యంలో ఓ కమిటీని ఏర్పాటు చేశారు. ముందుగా ఆక్రమణలను గుర్తించి వాటిని తొలగించేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాల్సిన బాధ్యత వివిధ శాఖల అధికారులపై ఉంచారు. ఆర్డీవో ఆధ్వర్యంలో ఇరిగేషన్, డ్రెయిన్స్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులతోపాటు ట్రాన్స్‌పోర్టు శాఖకు చెందిన అధికారులతో కూడిన కమిటీలు ఆక్రమణలు తొలగించే కార్యాచరణకు సిద్ధమవుతున్నాయి. దీనిలోభాగంగా తొలుత అమలాపురం ఆర్డీవో కె.మాధవి ఆధ్వర్యంలో రాజోలు ప్రాంతంలో కీలక బిందువుగా ఉన్న తాటిపాక సెంటర్‌లో ఆక్రమణల తొలగింపు ప్రక్రియకు వివిధశాఖల అధికారులతో కలిసి అక్కడ పర్యటించి పరిస్థితులను సమీక్షించారు. వీటితోపాటు తాటిపాక సెంటర్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, సెంటర్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయనున్నారు. 216కు అనుసంధానంగా తాటిపాక నుంచి కడలి వెళ్లే కెనాల్‌ను ఆనుకుని ఉన్న పక్కా కట్టడాలను తొలగించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు.



తాటిపాకలో ఆక్రమణలకు గురైన ప్రాంతాలను పరిశీలిస్తున్న ఆర్డీవో

డంపింగ్ యార్డులో కలెక్టర్



రామచంద్రపురంలో డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

రామచంద్రపురం పట్టణంలోని బైపాస్‌రోడ్డు వద్ద ఉన్న డంపింగ్‌యార్డును మున్సిపల్ అధికారులతో కలిసి కలెక్టర్ మహేష్‌కుమార్ పరిశీలించారు. పేరుకుపోయిన చెత్తను లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ చేసి ఆ చెత్తనుంచి మట్టి, ప్లాస్టిక్, ఇతరాలు వేరు చేసే ప్రాసెసింగ్ పరికరాన్ని పరిశీలించారు. ప్రాసెసింగ్ ఏజెన్సీ కాంట్రాక్టర్, రామచంద్రపురం కమిషనర్‌లకు సూచనలు చేశారు. అనంతరం జ్యోతీరావు పూలే బాలికల సంక్షేమ వసతిగృహాన్ని, మెయిన్‌రోడ్డులో అన్నక్యాంటీన్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు.

-రామచంద్రపురం(ద్రాక్షారామ)

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పీ4 అమలు : కలెక్టర్

అమలాపురం, జూలై 7(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం, దాతలు ప్రజాభాగస్వామ్యంతో చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలుచేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, సచివాలయ సంక్షేమ డిజిటల్ సహాయకులతో సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉన్నతస్థితిలో ఉన్న 10 శాతం మందిని, అట్టడుగున ఉన్న 20శాతం మంది పేదలను దత్తత తీసుకుని వారికి అండగా నిలవాలన్నారు. జిల్లావ్యాప్తంగా 64వేలమంది బంగారు కుటుంబాలను సర్వే ద్వారా గుర్తించినట్టు తెలిపారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారులు సంబంధిత శాసనసభ్యుల సమన్వయంతో మార్గదర్శకులను గుర్తించి నిర్దేశిత ప్రొఫార్మాలో నాలుగురోజుల్లో జాబితాను సమర్పించాలని ఆదేశించారు. ఆర్డీవోలు దేవరకొండ అఖిల, సీపీవో మురళీకృష్ణ, నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, సచివాలయ, సంక్షేమ, డిజిటల్ సహాయకులు పాల్గొన్నారు.

పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌పై మార్గదర్శకాలు

ఈనెల 10న ప్రభుత్వ, ప్రైవేటు ఎయిడెడ్ యాజమాన్యాల్లోని పాఠశాలు, జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాల ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. నియోజకవర్గ, మండల స్థాయిలో ఎంఈవోలు, అధికారులు, హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లతో సోమవారం కలెక్టరేట్ నుంచి అన్నిపాఠశాలల అధికారులతో కాన్ఫరెన్సు నిర్వహించారు. మెగా తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల సమావేశ విధివిధానాలు, సన్నద్ధత చర్యల పట్ల వారికి వివరించారు. ఈఏడాది ప్రైవేటువిద్యా సంస్థల్లోను కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో 1595 ప్రభుత్వ, 555 ప్రైవేటు పాఠశాలలు వెరసి 2150 పాఠశాలలన్నింటిలోను వంద జూనియర్‌కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల యాజమాన్య భాగస్వామ్యంతో ఈ సమావేశాల నిర్వహణ చేపట్టాలన్నారు. జేసీ టి.నిషాంతి, డీఈవో సలీంబాషా, డీఎంహెచ్‌వో దుర్గారావుదొర పాల్గొన్నారు.

కల సాకారం దిశగా..

- శరవేగంగా సాగుతున్న లంక గ్రామాల వంతెన నిర్మాణ పనులు
- పూర్తయితే వరద ముప్పు తప్పినట్టే
- 60శాతం పనులు పూర్తి.. బిల్లుల మంజూరులో మాత్రం తీవ్ర జాప్యం



పి.గన్నవరం మండలం గంటిపెదపూడిలో నిర్మితమవుతున్న వంతెన అప్రోచ్‌పై వేస్తున్న సీసీ రోడ్డు

పి.గన్నవరం, జూలై 7(ఆంధ్రజ్యోతి): గోదావరికి వరద వస్తే ఆ.. లంక గ్రామాలు అంధకారంలోకి వెళ్లాల్సిందే. గోదావరికి ఎర్రనీరు వచ్చిన నాటినుంచి నీరు రంగు మారే వరకు లంక గ్రామస్తులకు నాటు పడవలే శరణ్యం. ఆ.. నాలుగు లంక గ్రామాల ప్రజల కలలను నెరవేర్చడానికి ఇప్పటికే వంతెన నిర్మాణానికి గతంలో పనులు ప్రారంభించినా పూర్తి కాలేదు. ప్రస్తుతం పనులు వేగవంతమయ్యాయి.

గతంలోనే పనులు ప్రారంభం

2014-19 టీడీపీ హయాంలో రూ.49.50కోట్ల వ్యయంతో వంతెన నిర్మాణం చేపట్టేందుకు మట్టి నమూనా పరీక్షలు, వంతెన డిజైన్ తదితర అంశాలను పూర్తి చేసి టెండర్లు దశకు తీసుకువచ్చి వంతెన నిర్మాణానికి భూమిపూజ చేశారు. పనులు ప్రారంభించే లోపు 2019 ఎన్నికలు రావడంతో వంతెన నిర్మాణ అంశం మరుగున పడిపోయింది. ఈ నేపథ్యంలో వరదల సమయంలో పర్యటనకు వచ్చిన అప్పటి సీఎం జగన్ లంక గ్రామస్తులకు హామీ ఇచ్చి చివరి దశలో వంతెన పనులు ప్రారంభించారు. 2023, మార్చి నెలలో వంతెన పనులకు శ్రీకారం చుట్టారు. అప్పటి కాంట్రాక్టర్ బిల్లు మంజూరు కాకపోయినా పనులు చేసుకుంటూ వచ్చారు. 2025 కల్లా వంతెన నిర్మాణం పూర్తి చేయాలని ఒప్పందంలో పేర్కొన్నప్పటికీ బిల్లులు మంజూరు కాకపోవడంతో పనులు ముందుకు సాగలేదు.

పూర్తయితే ఎంతో ఉపయోగం

వంతెన నిర్మాణం పూర్తయితే లంకగ్రామాల ప్రజల రాకపోకలతోపాటు వ్యవసాయ ఉత్పత్తులు సైతం తరలించేందుకు రైతులకు ఉపయోగపడుతుంది. గోదావరికి వరద నీరు రావడంతో బూరుగులంక నదీపాయలో ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక రహదారికి వరద ప్రవాహంలో కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో కొన్నిరోజులపాటు ఆగేలా గట్టును లంక గ్రామస్తులు పటిష్టపర్చనున్నారు. ఇటీవలే జిల్లాలో జరుగుతున్న ప్రాజెక్టులపై సమీక్షించిన కలెక్టర్ మహేష్‌కుమార్ వంతెన పనులు వచ్చే ఏడాది డిసెంబర్ నెలఖారుకు పూర్తి చేయాలని ఆదేశించారు.

వంతెన పనులు 60శాతం పూర్తి

గంటిపెదపూడిలో లంకగ్రామాల ప్రజలు రాకపోకల కోసం నిర్మితమవుతున్న వంతెన పనులు ఇప్పటివరకు 60శాతం పూర్తయ్యాయని పంచాయతీరాజ్ ప్రాజెక్టు డీఈ అన్యం రాంబాబు చెప్తున్నారు. వంతెనకు ఇరువైపులా అప్రోచ్‌లు, 9పిల్లర్లు, రెండు అప్పట్‌మెంట్‌లు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు ఆరు పిల్లర్లు, ఒక అప్పట్‌మెంట్ పనులు పూర్తయ్యాయి. పిల్లర్లకు ఏర్పాటు చేసే గడ్డర్ల తయారీకి అప్రోచ్‌పై సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తున్నారు. పిల్లర్ల మధ్య 32.4 మీటర్లు మేర పొడవుతో మూడు చొప్పున గడ్డర్లు ఏర్పాటు చేయనున్నారు. ఇటీవలే ఏఐఐబీ ప్రతినిధుల బృందం రెండుసార్లు వంతెన పనులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కానీ, ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఒక్క బిల్లు కూడా మంజూరు కాలేదని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నష్టపరిహారం ఇవ్వలేదు

వంతెన నిర్మాణం కోసం 2023లో ఏటిగట్టు దిగువున పట్టాభూమిలతోపాటు జిరాయితీ భూములు సైతం సేకరించారు. మొత్తం 9.11 ఎకరాల భూమిని సేకరించగా వాటిలో జిరాయితీ 4.32 ఎకరాలు, డి-పట్టా భూమి 95 సెంట్లు, 3.84 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. జిరాయితీ భూమికిగాను రూ.2.30కోట్ల నష్టపరిహారాన్ని సంబంధిత రైతులకు ప్రభుత్వం చెల్లించాల్సిఉంది. కానీ ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా రాలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని ఇటీవలే పరిశీలనకు వచ్చిన ఏఐఐబీ బృందానికి సైతం రైతులు వివరించారు. నష్టపరిహారం విషయాన్ని అధికారులు కలెక్టర్‌కు వివరించగా లేఖరూపంలో పంపుతామన్నారని పంచాయతీరాజ్ అధికారులు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 290 అర్జీలు



కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న జేసీ నిషాంతి

అమలాపురం టౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక జేసీ టి.నిషాంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులనుంచి జేసీతోపాటు జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, డీసీహెచ్ఎస్ కార్తీక్‌రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర అర్జీదారులనుంచి 290 అర్జీలు స్వీకరించారు. జేసీ నిషాంతి మాట్లాడుతూ అర్జీదారుల సమస్యలపట్ల సత్వరమే స్పందించి పరిష్కార మార్గాలు చూపాలన్నారు. డీఎఫ్‌వో ఎంవీ ప్రసాదరావు, ఎస్‌డీసీ ఇకృష్ణమూర్తి, డీఎల్డీవో రాజేశ్వరరావు, డీఎస్వో ఉదయభాస్కర్, డీపీవో డి.శాంతలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, వికాసా జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో 24 అర్జీలు

అమలాపురంటౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ఎస్పీ బి.కృష్ణారావుకు 24 అర్జీలు అందించారు. అర్జీదారుల సమస్యలను ఆయన నేరుగా అడిగి తెలుసుకున్నారు. పోలీసు అధికారులతో మాట్లాడి ఆయా కేసులను విచారించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు.పీజీఆర్ఎస్ ఫిర్యాదులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.





విద్యార్థులు ఆ పాఠశాలకు నిత్యం కాలువలో నీటిని దాటుకుని వెళ్లాల్సిందే. నీరు ఎక్కువగా ఉంటే కళింగల్‌పై తాటిబద్దలు వేసుకుని దాటే పరిస్థితి. ప్రమాదకరమైన పరిస్థితుల్లో విద్యార్థులను పాఠశాలకు పంపేది లేదంటూ తల్లిదండ్రులు తేల్చిచెప్పడంతో ఒకప్పుడు వందకు పైగా ఉన్న విద్యార్థుల సంఖ్య రెండుకు పడిపోయింది. ఆ సమయంలో ఆ పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయుడు అనిశెట్టి సీతారామరాజు చొరవ తీసుకుని తన సొంత సొమ్ము లక్ష రూపాయలు వెచ్చించి బ్రిడ్జి నిర్మింపజేశారు. దీంతో ఇప్పుడు ఆ పాఠశాలకు వెళ్లేందుకు ప్రమాదం లేని శాశ్వత దారి ఏర్పడింది.



విద్యా వారధి

- విద్యార్థుల కోసం ఏకంగా బ్రిడ్జి నిర్మించారు
- సొంత నిధులు వెచ్చించిన ఉపాధ్యాయుడు సీతారామరాజు
- గొల్లప్రోలు పట్టణ శివారు సూరంపేట ప్రాథమిక పాఠశాలకు మార్గం సుగమం

గొల్లప్రోలు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణ శివారులోని సూరంపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కాలువ అవతల నిర్మించారు. సూరంపేట ప్రాంత వాసులు, ఇతర ప్రాంతాల పిల్లలు, ఉపాధ్యాయులు అక్కడకు కాలువ దాటుకుని వెళ్లాలి. వర్షాకాలం, కాలువలో నీరు ఉన్న సమయంలో మెరకచేను కళింగల్‌పై తాటిబద్దలు ఏర్పాటు చేసుకుని వెళ్తున్నారు. గతంలో నీరు ఎక్కువగా ఉన్న సమయంలో ఆ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు, వలంటీరు స్కూలుకి వెళ్లేందుకు కాలువ దాటే ప్రయత్నం చేయగా ప్రవాహంలో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయారు. అప్పటి వరకు వందకు పైగా ఉన్న విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. వరదలు, కాలువలో నీరు ఎక్కువగా ఉన్న సమయంలో తరగతులను సూరంపేటలోని రామాలయంలో నిర్వహిస్తూ వచ్చారు. ఇక్కడ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదు. ప్రమాదకరమైన పరిస్థితుల్లో తమ పిల్లలను చదివించలేమంటూ తల్లిదండ్రులు ఇతర పాఠశాలల్లో చేర్పించారు. దీంతో విద్యార్థుల సంఖ్య రెండుకు పడిపోయింది. ఈ సమయంలో సూరంపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయుడు అనిశెట్టి సీతారామరాజు బదిలీపై వచ్చారు. పాఠశాల పరిస్థితులను గమనించారు. తాను పనిచేసే పాఠశాలలో విద్యార్థులకు ముందుగా దారి మార్గం ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. రూ.లక్ష సొంత ఖర్చుతో పాఠశాలకు వెళ్లేందుకు వీలుగా మెరక చేను కళింగల్‌పై బ్రిడ్జి నిర్మాణానికి పూనుకున్నారు. కళింగల్ కానులను ఎత్తు చేసి బ్రిడ్జి నిర్మించగా రక్షణ గోడల నిర్మాణం చేపట్టారు. దీంతో విద్యార్థులు పాఠశాలకు సురక్షితంగా వెళ్లేందుకు మార్గం ఏర్పడింది. ముగ్గురు విద్యార్థులు చేరడంతో విద్యార్థుల సంఖ్య ఐదుకు చేరగా మరో ముగ్గురు చేరేందుకు సిద్ధమయ్యారు. తాను పనిచేసే పాఠశాలకు మార్గం కోసం ఏకంగా బ్రిడ్జినే నిర్మించిన సీతారామరాజును పలువురు అభినందించారు.



సూపర్ సార్ మీరు...

పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పే మార్గదర్శి అయిన మీరు వారు పాఠశాలకు వెళ్లేందుకూ మార్గం చూపించారు. సూపర్ సార్ మీరు. సూరంపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు వెళ్లేందుకు దారి లేకపోవడంతో సొంత నిధులు లక్ష రూపాయలు వెచ్చించి కాలిబాట వంతెన ఏర్పాటు చేయించిన మీకు నా ప్రత్యేక అభినందనలు.

ఫేస్‌బుక్, ట్విట్టర్‌లో విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్


facebook

Nara Lokesh
2h

పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పే మార్గదర్శి, పిల్లలు పాఠశాలకు వెళ్లేందుకూ మార్గం చూపించారు. సూపర్ సార్ మీరు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు శివారు సూరంపేట ప్రాథమిక పాఠశాలకు వెళ్లేందుకు దారి లేకపోవడంతో తన సొంత నిధులతో కాలిబాట వంతెన ఏర్పాటు చేయించిన టీచర్ అనిశెట్టి సీతారామరాజు గారికి అభినందనలు.

పోషకాల యాజమాన్యంతో మేలైన దిగుబడులు



ట్రైనింగ్ మేన్యూల్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

- సీటీఆర్ఐ డైరెక్టర్ శేషుమాధవ్
- పంటల్లో సమగ్ర పోషకాల యాజమాన్యంపై సర్టిఫికెట్ కోర్సు

రాజానగరం, జూలై 7(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో సమగ్ర పోషకాల యాజమాన్యంతో మేలైన దిగుబడులు పొందవచ్చని జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధనా సంస్థ (సీటీఆర్ఐ)డైరెక్టర్ మాగంటి శేషుమాధవ్ పేర్కొన్నారు. రాజానగరం మండలం కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ఆధ్వర్యంలో వ్యవసాయ సొసైటీల అధికారులు, ఎరువుల డీలర్లకు పంటల్లో సమగ్ర పోషకాల యాజమాన్యంపై 15 రోజులు పాటు సాగే సర్టిఫికెట్ కోర్సును సీటీఆర్ఐలో సోమవారం ప్రారంభించారు. దీనికి శేషు మాధవ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఎరువుల డీలర్లకు సమగ్ర పోషకాల యాజమాన్యంలోని వివిధ అంశాలైన రసాయనిక, జీవ, సేంద్రియ ఎరువులు, వివిధ పంటల్లో వేయాల్సిన ఎరువుల షెడ్యూలు, రసాయనిక ఎరువులను అధిక మోతాదులో వాడడం వల్ల కలిగే నష్టాలను కేవీకే అధికారులు వివరించడంతో పాటు క్షేత్ర ప్రదర్శనలు నిర్వహిస్తారన్నారు. జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు మాట్లాడుతూ సొసైటీల అధికారులు ఎరువుల దుకాణాలను నడిపేటప్పుడు వ్యాపారంతో పాటు సమాజసేవను దృష్టిలో ఉంచుకోవాలని రైతులకు సమతుల్యమైన రసాయన ఎరువుల ఉపయోగంపై అవగాహన కల్పించారు. ఈ 15 రోజుల కోర్సును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేవీకే హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు మాట్లాడుతూ కోర్సులో సర్టిఫికెట్ పొందాలంటే 80శాతం హాజరు తప్పనిసరి అన్నారు. కోర్సు సమయంలో తరగతి గది బోధనే కాకుండా భూసార కేంద్రాలకు, ఆదర్శ రైతుల క్షేత్రాలకు, సేంద్రియ వ్యవసాయ క్షేత్రాలకు ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సీటీఆర్ఐ సీనియర్ శాస్త్రవేత్త టి.అరుణ్ కుమార్, కేవీకే పశుసంవర్ధక అధికారి వి.నాగేశ్వరరెడ్డి, సస్యరక్షణాధికారి రఘునందన్, పంటల అధికారి అజ్మల్ తదితరులు పాల్గొన్నారు.

గంగతో శివుడిని మెప్పించే ప్రయత్నం

- వర్షం కోసం పరమేశ్వరుడికి సహస్ర ఘటాభిషేకం
- దుర్గాడలో ఏళ్ల నాటి ఆచారం

గొల్లప్రోలు రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గంగతో శివుడిని మెప్పించే ప్రయత్నంలో భాగంగా కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో 49సంవత్సరాలుగా తొలి ఏకాదశి మరుసటి రోజు ద్వాదశి పర్వదినాన సహస్ర ఘటాభిషేకం నిర్వహిస్తున్నారు. అదే రీతిన సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అభిషేకం జరిపారు. మహిళలు ఇళ్ల నుంచి తెచ్చిన పసుపు జలాలతో పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామిని తీసుకొచ్చి అభిషేకించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని కోనేటి నుంచి నీటిని బిందెలతో తీసుకువచ్చి శివలింగంపై ఉన్న గంగాదేవి పూర్తిగా నిండే వరకు అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణమంతా శివనామ స్మరణతో మార్మోగింది. ఈ పూజల వల్ల వర్షాలు పడి పంటలు పండి గ్రామం సుభిక్షంగా ఉంటుందని తమ నమ్మకమని పలువురు గ్రామస్తులు తెలిపారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు ఆధ్వర్యంలో ఆదిత్యశర్మ, షణ్ముఖశర్మ, కారుణ్య శర్మ, కార్తీక్‌శర్మ, ఆకెళ్ల దిలీప్‌కుమార్‌శర్మ, ర్యాలి సుబ్రహ్మణ్యకుమార్ శర్మ, సూరిభట్ల శ్రీనివాస్‌శర్మ సహస్ర ఘటాభిషేకం, 11 రుద్రాలతో అభిషేకాలు, పూజలు జరిపారు.



దుర్గాడలో ఉమారామలింగేశ్వరస్వామికి సహస్ర ఘటాభిషేక దృశ్యం



శివుడిని జలాలతో అభిషేకించేందుకు బిందెలతో సిద్ధంగా భక్తులు

రైల్వే రిజర్వేషను చార్టు ఇకపై 8గంటల ముందు ప్రకటన

రాజమహేంద్రవరం, జూలై 7(ఆంధ్రజ్యోతి): రైల్వే రిజర్వేషను చార్టులను ప్రకటించడంలో రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకొంది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే పీఆర్ నెం.233తో సోమవారం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకూ రెండు నుంచి నాలుగు గంటల ముందు చార్టు ప్రకటన జరిగేది. తదనుగుణంగా ప్రయాణికుల సెల్‌ఫోన్లకు మెసేజ్ వస్తోంది. ప్రయాణికులకు మరింత సౌలభ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఇకపై రైలు బయలుదేరే 8గంటల ముందుగానే చార్టు ప్రకటన జరుగుతుంది. ఉదయం 5గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ ప్రయాణ సమయాలు ఉన్న ప్రయాణాలకు ముందు రోజు రాత్రి 9గంటలకు, మధ్యాహ్నం 2గంటల ఉంచి ఉదయం 5గంటల వరకూ ప్రయాణ సమయాలు ఉన్న వారికి ఆయా సమయాలకు 8గంటల ముందు చార్టులను విడుదల చేస్తారు. అప్పడే ప్రయాణికుల సెల్‌ఫోన్లకు మెసేజ్ కూడా వస్తుంది. ఉదాహరణకు ఈ రోజు ఉదయం 5.30గంటలకు ప్రయాణం ఉంటే నిన్న రాత్రి 9గంటలకు చార్టు విడుదలవుతుంది. ఈ రోజు మధ్యాహ్నం 3గంటలకు ప్రయాణ సమయం ఉంటే అదే రోజు ఉదయం 7గంటల సమయంలో చార్టును విడుదల చేసే అవకాశం ఉంది. కాగా ఇప్పటి వరకూ గరిష్ఠంగా 4గంటల ముందు చార్టు ప్రకటిస్తుండడంతో రిజర్వేషను దొరకని.. అంటే ముఖ్యంగా వెయిటింగ్ లిస్టు ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడేవారు. వారి ప్రయాణానికి ప్రత్యామ్నాయం చూసుకోడానికి తక్కువగా సమయం ఉండడంతో ఆందోళన చెందేవారు. ఇప్పుడు చార్టింగ్ విడుదల సమయం 8గంటల ముందుకు జరపడంతో ఈ సమస్య నెమ్మదించే అవకాశం ఉంది.

శాకంబరిగా చింతలూరు నూకాంబిక

100 కిలోల కూరగాయలతో అలంకరణ



ఆలమూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాలో పేరుగాంచిన చింతలూరు నూకాంబికా అమ్మవారు సోమవారం శాకంబరిగా భక్తులకు దర్శనమించారు. ఆషాఢ మాసం అమ్మవారి జన్మనక్షత్రమైన అనురాధ నక్షత్ర పర్వదినాన అమ్మవారిని భక్తులు వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. దేవస్థానం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆలయార్చకులు, భక్తులు అనేక రకాలైన కూరగాయలను అమ్మ వారికి అలంకరించారు. అనంతరం భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వుండవల్లి వీర్రాజుచౌదరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు మంద కృష్ణ పోరు మరువలేనిది



జవహర్, ఎమ్మెల్యే వేగుళ్లను సత్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎస్సీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ జవహర్

మండపేట, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ చేసిన పోరాటం మరువలేనిదని, నేటి తరాలకు ఆయన స్ఫూర్తి అని ఎస్సీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ కేఎస్ జవహర్ అన్నారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మంద కృష్ణ పుట్టినరోజు, ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు దూళి జయరాజు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి చంద్రశేఖర్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక ఏపీ అధ్యక్షుడు బుంగ సంజయ్ మాదిగల ఆధ్వర్యంలో జరిగింది. స్థానిక సూర్య కన్వెన్షన్ హాలులో జరిగిన ఈ కార్యక్రమానికి జవహర్‌తోపాటు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు విచ్చేశారు. తొలుత ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, నాయకులు బైక్ ర్యాలీ జరిపారు. అనంతరం సూర్య కన్వెన్షన్ హాల్లో జరిగిన కార్యక్రమంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జవహర్ మాట్లాడుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిని ఏర్పాటు చేసి వర్గీకరణ ఫలాలు సాధించిన మంద కృష్ణ కృషిని జాతి మరువదన్నారు. వర్గీకరణకు సహకరించిన ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌లకు రుణపడి ఉంటామన్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి అని విధాలుగా పనిచేస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా జవహర్, వేగుళ్లలను ఎమ్మార్పీఎస్ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, దివ్యాంగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ చదువుతో పాటు సంస్కారం ఉండాలి... చదువు ఉత్తములుగా తయారు చేస్తే.. సంస్కారం ఉన్నతులుగా తీర్చిదిద్దుతుంది... విద్య లేని వాడు వింత పశువు ఎలాగో నేటి సమాజంలో విలువలు లేని వాడు కూడా అంతే.. విలువల్లేని విద్య వ్యర్థమే. పిల్లలకు నైతిక విలువల గురించి చెప్పాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. నాగరికతతో ఎలా నడుచుకోవాలి... స్నేహపూర్వకంగా ఎలా మసలుకోవాలి... పెద్దల పట్ల ఎలా వినయ, విధేయతలు చూపాలి... గురువులను ఎలా గౌరవించాలి... ఓర్పు, సహనంతో ఎలా విజయాలు సాధించాలి... ఎదుటివారికి ఎలా సాయపడాలి?, చెడు అలవాట్లకు ఎలా దూరంగా ఉండాలి..., ఏం మాట్లాడాలి/ఏమేమి మాట్లాడకూడదు... ఇలా అనేక విషయాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉంది. ఇలాంటి విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు పాఠశాలల్లో అందించడంపై విషయమై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. నేటి సమాజంలో తగ్గిపోతున్న విలువలను విద్యార్థులకు తెలియజేసేందుకు కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. త్వరలోనే విలువల విద్యకు సంబంధించిన పుస్తకాలు అందజేయనుంది.

'విలువల' విద్య



- పాఠశాల విద్యార్థులకు అందించేందుకు కూటమి సర్కారు చర్యలు
- విద్యారంగ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు సూచనలతో రూపకల్పన
- 39 పేజీల పుస్తకంలో అనేక విశేషాలు... త్వరలో పంపిణీకి ఏర్పాట్లు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ పాఠశాలల్లో 6-10 తరగతులు చదివే విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుంచి 'విలువల విద్య' పుస్తకాలను అందించనున్నారు. విద్యారంగ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు సూచనలతో రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి ఈ పుస్తకాలను రూపొందించింది. ఆరో తరగతికి 'తోరణాలు', ఏడో తరగతికి 'మనోవికాసం', ఎనిమిది, తొమ్మిది తరగతులకు 'సూక్తి సుధ', పదో తరగతికి 'అమృతధార' పేరుతో ఈ పుస్తకాలను తీసుకొచ్చారు. ఇవి ఒక్కొక్కటి దాదాపు 39 పేజీల వరకు ఉన్నాయి. పుస్తకాల్లో క్యూఆర్ కోడ్ పెట్టారు. ఆయా పాఠ్యాంశాల వీడియోలు కావాలనుకున్న వారు వాటిని స్కాన్ చేయాలి. సుప్రసిద్ధ క్యాన్సర్ వైద్యుడు నోరి దత్తాత్రేయుడు, ప్రసిద్ధ చిత్రకారుడు బాపు గురించి క్లుప్తంగా ఇచ్చారని సమాచారం. ప్రస్తుతం ఈ పుస్తకాల ముద్రణ చివరి దశకు చేరింది. త్వరలో ఈ పుస్తకాలను విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా విడుదల చేయనున్నట్టు విద్యాశాఖాధికారులు చెప్తున్నారు. వారం, పది రోజుల్లో ఈ పుస్తకాలు విద్యా శాఖ కార్యాలయానికి చేరనున్నట్టు వారు వివరించారు.

ఏ తరగతిలో ఏం ఉంటాయి...

- పదో తరగతిలో విద్య విలువ, సజ్జన సహవాసం, కీర్తి శరీరం, సహజ గుణాలు, నింద చెందకు, మాట తూలకు అనే పాఠ్యాంశాలు ఉండనున్నాయి.
- తొమ్మిదో తరగతిలో కోపం-శాంతం, వాగ్భూషణం, సార్థకత, నాయకత్వం, అభివృద్ధి పథం, తస్మాత్ జాగ్రత్త పాఠ్యాంశాలు ఉన్నాయి.
- ఎనిమిదో తరగతిలో ఓర్పుతో విజయం, అందమైన అలవాటు, సాయానికి సిద్ధం, శిక్షణ, దుర్గుణాలు, గౌరవం పాఠాలు ఉంచారు.
- ఏడో తరగతిలో నిషిద్ధం, దృష్టికోణం, సుజనుడు, కుటుంబ విలువలు, దివ్యాంగులకు చేయూత, దృఢచిత్తం పాఠాలను తీసుకొచ్చారు.
- ఆరో తరగతిలో సాయం చేద్దాం, యోగ్యతకే అధికారం, సాటి లేని మేటి, నడత, గుణము, చిన్ననాటి పాఠాలు పొందుపరిచారు.

అనేక విషయాలపై అవగాహనకు...

ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని 6-10 తరగతుల విద్యార్థులకు ఈ ఏడాది లింగ సమానత్వం, రాజ్యాంగంపైనా పుస్తకాలు అందించనున్నారు. వ్యవసాయ పనుల్లో మహిళల భాగస్వామ్యం, ఇంటి పనుల్లో మహిళలకు మగవారి సాయం లాంటి వాటిని లింగ సమానత్వం పుస్తకాల్లో తీసుకురానున్నారు. బాల్య వివాహాలపై పిల్లలకు అవగాహన కల్పించేలా పాఠ్యాంశాన్ని తీసుకొస్తున్నారు.

సమాజం పట్ల అవగాహన కోసం..

రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, విధులు వంటి అంశాలతో మరో పుస్తకాన్ని తీసుకొస్తున్నారు. పిల్లల్లో నైతిక విలువలు, ప్రశ్నించేతత్వం, సమాజం పట్ల అవగాహన కల్పించేలా మూడు పుస్తకాలను తీసుకొస్తున్నారు.

భవిష్యత్ తరాలకు ఆదర్శం.. డొక్కా సీతమ్మ



ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్‌లో డొక్కా సీతమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే పంతం నానాజీ

ఎమ్మెల్యే పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): దానాల్లోకెల్లా అన్నదానం గొప్పది.. నిరంతరం అన్నార్తుల ఆకలి తీర్చిన అన్నపూర్ణాదేవి డొక్కా సీతమ్మ స్ఫూర్తి భవిష్యత్ తరాలకు ఆదర్శమని ఎమ్మెల్యే పంతం నానాజీ కోరారు. కాకినాడలోని ఏపీఎస్పీ హైస్కూలు ప్లస్ ప్రాంగణంలో తెలుగు ఉపాధ్యాయురాలు ముత్యా వెంకటలక్ష్మి రూ.78 వేలతో ప్రముఖ శిల్పి రాజకుమార్ వడయార్‌తో తయారు చేయించిన డొక్కా సీతమ్మ విగ్రహాన్ని డీవైఈవో వెంకటేశ్వరనాయుడు, హెచ్ఎం గాయత్రిలతో కలసి ఎమ్మెల్యే సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కోరికపై పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరు పెట్టారన్నారు. ఆమె సేవలను భావి తరాలకు చాటిచెప్పాలన్న ఉద్దేశ్యంతో ఉపాధ్యాయురాలు వెంకటలక్ష్మి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను పంపిణీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను ఎమ్మెల్యే పరిశీలించారు. విద్యార్థులకు భోజనం వడ్డించి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో వేణుగోపాలరావు, కార్యదర్శి జొన్నాడ నరసింహరావు, నాయకులు తాటికాయల వీరబాబు, మాదారపు తాతాజీ, రాయుడు అనిల్, తురగా సంతోష్ పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో మండపేటకు రెండో స్థానం

పరిపాలన పరిశుభ్రత, అభివృద్ధిలో ప్రగతి ఆధారంగా గుర్తింపు.. ఐవీఆర్ఎస్ సర్వే

మండపేట, జూలై 7(ఆంధ్రజ్యోతి) రాష్ట్ర స్థాయిలో 77 మున్సిపాల్టీలో ఐవీఆర్ఎస్ ద్వారా ప్రభుత్వం నిర్వహించిన ఇంటింటా చెత్త సేకరణ, పరిసరాల పరిశుభ్రత, అభివృద్ధి పాలనాపరమైన అంశాలపై రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ప్రజా సర్వేలో మండపేట మున్సిపాల్టీకి రాష్ట్రస్థాయిలో రెండోస్థానం దక్కిందని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. సోమవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో పురపాలకశాఖ రాష్ట్ర కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ ఐవీఆర్ఎస్ సర్వే ఆధారంగా పారిశుధ్యం, పరిశుభ్రత అంశాల్లో మండపేట పట్టణం రెండో స్థానంలో నిలిచిందన్నారు. పట్టణాన్ని అన్ని విధాల పరిశుభ్రంగా ఉంచడం, తడి, పొడి చెత్త సేకరణలో శ్రద్ధ కనబరిచిన మున్సిపల్ సిబ్బందితోపాటు మెప్మా సిబ్బందిని అభినందించారని కమిషనర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిశుభ్రత విషయంలో తమకు సహకరించిన పట్టణ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. శానిటరీ ఇంజనీరింగ్ పరిపాలన ఉద్యోగులను అభినందించారు.



మండపేట మునిసిపల్ కార్యాలయం

వెంకన్న ఆలయంలో రాష్ట్ర అటవీ ఐటీ సలహాదారుడి పూజలు



ఆత్రేయపురం, జూలై 7(ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి వేంకటేశ్వరస్వామిని సోమవారం రాష్ట్ర అటవీ శాఖ ఐటీ ముఖ్య సలహాదారుడు పెన్నమరెడ్డి నాగబాబు దంపతులు దర్శించుకున్నారు. వారికి అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపించారు. వేదపండితుల ఆశీర్వచనం అందుకుని స్వామివారి ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ సిబ్బంది స్వామివారి శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణ జాప్యంపై
అమలాపురం ఎంపీ ఆగ్రహం


ఎన్‌హెచ్ ప్రాజెక్టు డైరెక్టర్‌తో భేటీ అయిన ఎంపీ

ఎన్‌హెచ్ ప్రాజెక్టు డైరెక్టర్‌తో భేటీ

ఈ నెలాఖరు నాటికి ఫ్లైఓవర్ పూర్తి చేస్తామని కాంట్రాక్టరు హామీ

అమలాపురం, జూలై 7(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 16వ జాతీయ రహదారిపై జొన్నాడ వద్ద హైవే ఫ్లైఓవర్ నిర్మాణంలో కాంట్రాక్టు సంస్థ అనుసరిస్తున్న నిర్లక్ష్యంపై అమలాపురం పార్లమెంటు సభ్యుడు గంటి హరీష్‌మాధుర్ తీవ్ర ఆగ్రహం, అసహనం వ్యక్తం చేశారు. జొన్నాడ ఫ్లైఓవర్ పురోగతిపై కేంద్ర ఉపరితల రవాణామంత్రి నితిన్ గడ్కరీతో మాట్లాడతానని ఆయన పేర్కొన్నారు. జొన్నాడ హైవే పనులపై హైవే ప్రాజెక్టు డైరెక్టర్, జొన్నాడ ఫ్లైఓవర్ కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులతో అమలాపురంలోని ఎంపీ కార్యాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. రాజమహేంద్రవరంలోని మోరంపూడి ఫ్లైఓవర్‌ను అసంపూర్తిగా వదిలేశారని, జొన్నాడ ఫ్లైఓవర్ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులపై ఎంపీ అసహనం వ్యక్తం చేశారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుని ప్రాజెక్టును త్వరితగతిన చేపట్టాల్సిందిగా డైరెక్టర్‌ను కోరారు. జూలై నెలాఖరుకు ఫ్లైఓవర్ గడ్డర్ల పని పూర్తిచేస్తామని కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు ఎంపీకి హామీఇచ్చారు. ఈ ఏడాది డిసెంబరు నెలాఖరు నాటికి పనులు పూర్తి చేస్తామన్నారు. దీనిపై ఎంపీ హరీష్‌మాధుర్ మాట్లాడుతూ ఈ వారంలో కేంద్రమంత్రి నితీష్‌గడ్కరీతో సమావేశమవుతానని, వివిధ ప్రాంతాల్లో కాంట్రాక్టు సంస్థ చేపడుతున్న పనులపై చర్చిస్తానని తెలిపారు. అదేవిధంగా జాతీయ రహదారి అభివృద్ధి పనులను ఎన్‌హెచ్ డైరెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ముడికి సెంటర్, చెముడులంక జంక్షన్‌లో సర్వీసు రోడ్ల నిర్మాణం అగ్రిమెంట్ దశలో ఉందని, చొప్పెళ్ల జంక్షన్ వద్ద అభివృద్ధి పనులు పూర్తిచేసినట్టు తెలిపారు. జొన్నాడ ఆంజనేయ స్వామి గుడి వద్ద సోలార్ లైట్ల నిర్మాణం టెండరు దశలో ఉందన్నారు. రావులపాలెం సెంటర్‌లో సర్వీసు రోడ్డు, హైవే లైట్లు నిర్మించామన్నారు. మల్లాయిదొడ్డి సెంటర్‌లో సోలార్ లైట్ల నిర్మాణానికి టెండర్లు పిలిచామని, ఈతకోట, గోపాలపురం సెంటర్‌లో సోలార్ లైట్ల ఏర్పాటు పూర్తయిందని ఎంపీ తెలిపారు.

టౌన్.. క్లీన్!

ఇక పట్టణాల్లో కంపోస్టు యార్డులు కనుమరుగు

- అక్కడి చెత్తంతా పవర్ ప్లాంట్‌లకు తరలింపు
- విశాఖ లేదా గుంటూరు జిందాల్ చెత్త నుంచి విద్యుత్ తయారు చేసే ప్లాంట్‌కు తరలించాలని ప్రభుత్వం ఆదేశాలు
- చెత్త తరలించే కంపాక్టర్‌ల కొనుగోలుకు రూ.225 కోట్ల కేటాయింపు
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, పురపాలక సంస్థలు నగదు చెల్లింపు


మండపేటలో సంఘం కాలనీకి వెళ్లే దారిలో ఉన్న కంపోస్టు యార్డు

మండపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఇక పట్టణాలు, నగరాల్లో ఎక్కడా చెత్త వేసే కంపోస్టు యార్డులు కనిపించవు. ఆయా ప్రాంతాలను చెత్తరహితంగా తీర్చిదిద్దాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా రూ.225 కోట్ల వ్యయంతో రహదారులను శుభ్రం చేసే స్కేపింగ్ యంత్రాలు, చెత్తను తరలించే కంపాక్టర్‌లను కొనుగోలు చేయాలని తాజాగా ఆదేశాలను జారీ చేసింది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సగం, పురపాలక సంస్థలు సగం వంతున నగదును చెల్లించి యంత్రాలను కొనుగోలు చేయాలని పురపాలక సంస్థలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చెత్త అక్కడికి..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న పురపాలక సంస్థలు రాజమహేంద్రవరం, కాకినాడతో నగరాలతోపాటు అమలాపురం, ముమ్మిడివరం, రామచంద్రపురం, సామర్లకోట, పెద్దాపురం, తుని, పిఠాపురం, ఏలేశ్వరం, కొవ్వూరు, నిడదవోలు, మున్సిపాల్టీలలో ప్రతిరోజూ ఉత్పత్తి అయ్యే చెత్తను ఇక నుంచి ఏ రోజుకారోజు చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే కేంద్రాలు ఉన్న గుంటూరు లేదా విశాఖకు 40 టన్నుల సామర్థ్యం కలిగిన కంపాక్టర్ ద్వారా తరలించాల్సి ఉంటుంది. ఆ మేరకు అయ్యే రవాణా చార్జీలను ఆయా మున్సిపాల్టీలు భరించాల్సి ఉంటుంది. దీంతో క్లీన్ పట్టణాలుగా ఆయా మున్సిపల్ పట్టణాలు కనిపించనున్నాయి. ఇప్పటివరకు చెత్తను నిల్వ చేసే కంపోస్టు యార్డుల్లో ఉన్న చెత్తను ఎరువుగా మార్చి వేసి అక్కడ చెత్తను పూర్తిగా ఖాళీ చేసి పార్కులుగా మార్చుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

చెత్త యార్డులు ఖాళీ చేసేందుకు టెండర్లు...

దాంతో అధికారులు మున్సిపాల్టీల్లో ప్రస్తుతం ఉన్న కంపోస్టు యార్డుల్లో చెత్తను వేరు చేసి దానిని తరలించి ఖాళీ చేసేందుకు టెండర్లు కూడా పిలిచారు. మండపేట మున్సిపాల్టీలో రూ.29 లక్షలతో కంపోస్టు కేంద్రంలో ఉన్న చెత్తను తరలించేలా టెండరు పిలిచారు. మున్సి పాల్టీల్లో ఏరోజు వచ్చే చెత్తను ఆరోజు లారీల ద్వారా సేకరించి వాటిని వాటర్‌వర్క్సుకు తరలించి అదేరోజు మున్సిపాల్టీకి దగ్గరగా ఉండే జిందాల్ విద్యుదుత్పత్తి చేసే కేంద్రం గుంటూరు లేదా విశాఖకు తరలించాలని ప్రభుత్వ ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు మున్సిపల్ అధికారులు కసరత్తు ప్రారంభించారు. పట్టణాల్లో నిత్యం ఉత్పత్తి అయ్యే చెత్త ఎంత మేర వస్తుంది, అందులో తడిచెత్త పొడిచెత్త ఎంతెంత? ప్లాస్టిక్ ఎంత అనేదానిపై కూడా ప్రభుత్వం లెక్కలు తీస్తోంది. ఈమేరకు మున్సిపల్ అధికారులు ఏమేరకు చెత్త ఉత్పత్తి అవుతుందనే దానిపై మల్లగుల్లాలు పడుతున్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుడు అత్యాచారయత్నం

నల్లజర్ల పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు

నల్లజర్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ నాయకుడినంటూ ప్రచారం చేసుకుంటున్న తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం నబీపేటకు చెందిన మర్రి శోభనబాబు అదే గ్రామానికి చెందిన మహిళపై అత్యాచారయత్నం చేశాడు. గ్రామానికి చెందిన ఓ వివాహిత తన భర్తతో మనస్పర్థల కారణంగా 4 ఏళ్ల క్రితం విడాకులు తీసుకుంది. మర్రి శోభనబాబు పలుమార్లు ఆమె ఇంటికి వచ్చి వేధించేవాడు. సోమవారం ఉదయం 7 గంటలకు వంట గదిలో ఉండగా శోభన్ బాబు వచ్చి తనపై అత్యాచారయత్నం చేశాడని, గోళ్లతో చేతులపై రక్కి పొత్తు కడుపుపై తన్నడంతో తాను పడిపోయాయని, పక్కింటి వారొచ్చి తనను ఆసుపత్రికి తీసుకెళ్లినట్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై సీఐ రాంబాబును వివరణ కోరగా విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

వైభవంగా నాయినార్ల విగ్రహ ప్రతిష్ఠ

రాచపల్లికి తరలివచ్చిన ఎమ్మెల్యేలు, స్వామీజీలు, బీజేపీ నాయకులు



విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేస్తున్న దృశ్యం, భక్తజనంతో కిక్కిరిసిన ఆలయం

ప్రత్తిపాడు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లి అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో నాయినార్ల విగ్రహ ప్రతిష్ఠ సోమవారం వైభవంగా నిర్వహించారు. అరుణాచలంలోని దేసిక పరామాచార్య స్వామి చేతులమీదుగా 63 నాయినార్ల విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ప్రత్తిపాడు, జగ్గంపేట, పెద్దాపురం, అనపర్తి ఎమ్మెల్యేలు వరుపుల సత్యప్రభ, జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చినరాజప్ప, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పోకల వంశీ నాగేంద్రమాధవ్, పలు వురు పీఠాధిపతులు, స్వామిజీలు, ప్రముఖులు పాల్గొన్నారు. అరుణాచలంలోని 27వ సన్నిధానానికి చెందిన మాసిలామణి జ్ఞాన సంబంధ దేసిక పరామాచార్య స్వామి అరుణాచల ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ పి. అరుణాచల కార్తికేయ శివాచార్య స్వామిజీలు, తదితర వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య నాయినార్ల విగ్రహాలకు కుంభాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలోని దక్షిణామూర్తి, లక్ష్మి హాయిగ్రీవ, సూర్యభగవాన్, కాళ్ళ భైరవ, గంగామాత విగ్రహాలను కూడా ఉప ఆలయాల్లో స్వామిజీలను ప్రతిష్ఠించారు. ప్రముఖ నాయినార్ల చరిత్ర కారిణి, ఆధ్యాత్మిక ప్రవచనకర్త అరుణాచలమాధవి, అరుణాచల ఆలయ వ్యవస్థాపకులు స్వామి రమానంద పర్యవేక్షణలో ఈ విగ్రహాల ప్రతిష్ఠ జరిగింది. విగ్రహాలకు ఎమ్మెల్యేలు, బీజేపీ నేతలు మాధవ్, బిక్కిన విశ్వేశ్వరరావు పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు రమానంద, వాసుదేవ నంద గిరిస్వామి, సినీ నటుడు కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి, మాజీ చీఫ్ సెక్రటరీ ఎల్‌వీ సుబ్రహ్మణ్యం, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, అన్నపూర్ణమ్మ దంపతులు, ఎన్ఎఫ్‌సీఎల్ మాజీ చైర్మన్ కేవీఎస్ రాజు, పెరల్ గ్రానెట్స్ ఎంపీచలవాది వెంకటనాగరాజు, శ్రీదేవి దంపతులు తదితరులు పాల్గొన్నారు.


స్వామిజీల ప్రసంగాలను వింటున్న ఎమ్మెల్యేలు, ప్రముఖులు


గొల్లప్రోలు సమావేశంలో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయకుండా మాయమాటలు

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌ను ప్రజలు నిలదీయాలి

మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ

గొల్లప్రోలు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా మాయమాటలు చెప్పేవారిని మోసగాళ్లని కాకుండా ఏమని పిలవాలని మాజీ మంత్రి, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలులోని సత్యకృష్ణ ఫంక్షన్ హాలులో సోమవారం కాకినాడ మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ ఆధ్వర్యంలో జరిగిన పిఠాపురం నియోజకవర్గ వైసీపీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ హామీలు అమలు చేయకపోవడంపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌ను ప్రజలు నిలదీయాలన్నారు. వాటిపై అడిగితే మక్కెలు విరగకొడతాం, తాటలు తీస్తామని బాబు,పవన్ అంటున్నారని.. ప్రజల్లో తిరిగితే ఎవరి మక్కెలు విరగగొడతారో తెలుస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క ఉద్యోగం ఇవ్వలేకపోయారని విమర్శించారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా ప్రజలు మోసపోతారని.. చంద్రబాబు వంద చెబితే, లోకేశ్ రెండు వందల అబద్ధాలు చెబుతాడని ఎద్దేవా చేశారు. కూటమి ఇచ్చే హామీలు అమలు చేసే బాధ్యత తనదని, ఎన్నికల ముందు చెప్పిన పవన్ ఇప్పుడు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. వైసీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా మాట్లాడుతూ చంద్రబాబును సీఎంగా చూడాలనుకునే పవన్‌ను హీరోగా భావించడం మన ఖర్మన్నారు. ఎమ్మెల్యే అయిన పవన్ పిఠాపురం ఎన్నిసార్లు వచ్చాడని, ఆయనకు ప్రజా సమస్యల పట్టించుకునే తీరిక ఉందా అని ప్రశ్నించారు. కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల వైసీపీ అధ్యక్షులు దాడిశెట్టి రాజా, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ మంత్రి తోట నరసింహం, నేతలు ముద్రగడ గిరిబాబు, దవులూరి దొరబాబు, యనమల కృష్ణుడు ఉన్నారు.

బైక్‌ల దొంగ అరెస్టు

14 రోజుల రిమాండ్

అమలాపురం టౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అమలాపురం ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండుకు వచ్చే ప్రయాణికుల మోటారు సైకిళ్లను దొంగిలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతడి నుంచి 4 మోటారుసైకిళ్లు, రూ.10వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. అమలాపురం రూరల్ మండలం బండారులంక గ్రామానికి చెందిన గోళ్ల నాగబసవరాజు గత కొంతకాలంగా మోటారు సైకిళ్ల చోరీకి పాల్పడుతున్నాడు. పట్టణ ఎస్ఐ టి.శ్రీనివాస్ సిబ్బందితో కలిసి బసవరాజును పట్టుకుని మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు సోమవారం తెలిపారు. నిందితుడిని కోర్టులోహాజరుపరుచగా 14 రోజులు రిమాండ్ విధించగా కొత్తపేట సబ్‌జైలుకు తరలించినట్టు సీఐ తెలిపారు.

హుండీలో నగదు చోరీ చేసిన నిందితుడి అరెస్ట్

కరప, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం నడకుదురులోని వేంకటేశ్వరస్వామి గుడి హుండీని బద్దలు కొట్టి నగదు చోరీ చేసిన నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్టు ఎస్ఐ తోట సునీత తెలిపారు. ఈనెల 3న నడకుదురులోని వేంకటేశ్వరస్వామి గుడి హుండీలోని నగదు చోరీ జరిగింది. గుడి నిర్వాహకుడు గొల్లపల్లి చంద్రశేఖర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలించారు. ఈ క్రమంలో కాకినాడరూరల్ మండలం తూరంగి గ్రామానికి చెందిన బొడ్డు అంజిబాబు అలి యాస్ తిక్క అంజి చోరీ చేసినట్టు గుర్తించారు. నడకుదురులోని ఒక ఫంక్షన్ హాల్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకుని హుండీ డబ్బులు రూ.3,600ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కాకినాడ ఎస్‌జేఎఫ్‌సీఎం ఫర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టులో హాజరుపరచగా కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది.

హీరో ప్రభాస్ పేరున కుంకుమార్చన

'లోవ'లో శ్యామలాదేవి ప్రత్యేక పూజలు


అమ్మవారికి సారె సమర్పిస్తున్న శ్యామలాదేవి

తుని రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): దివంగత సినీ నటుడు, పార్లమెంట్ సభ్యుడు కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి కాకినాడ జిల్లా తలుపులమ్మ లోవ దేవస్థానంలో అమ్మవారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢమాస పర్వదినాలను పురస్కరించుకుని అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం సినీ హీరో ప్రభాస్ పేరున కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ పండితులు వేద ఆశీర్వచనాలు ఇచ్చి అమ్మవారి మహా ప్రసాదాన్ని శ్యామ లాదేవికి అందజేశారు. ఆమె మాట్లాడుతూ తూర్పు కనుమల్లో ఆహ్లాదకర వాతావరణంలో అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని, పండితులు ఆలయ వైభవాన్ని చెప్పిన తర్వాత ఏటా అమ్మవారిని దర్శించుకోవాలని కోరిక కలిగిందని ఆమె తెలిపారు.


ఆలయ ప్రాంగణంలో ప్రకృతిని ఆస్వాదిస్తూ...

ఏసీబీ కేసులో తప్పుడు సాక్ష్యం
వ్యక్తికి జైలు, జరిమానా

ఉండ్రాజవరం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఏసీబీ కేసులో తప్పుడు సాక్ష్యం చెప్పిన వ్యక్తికి ఏడాది జైలు, రూ.500 జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 3వ అదనపు ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సోమవారం తీర్పు చెప్పినట్టు రాజమహేంద్రవరం ఏసీబీ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం కె.సావరం గ్రామానికి చెందిన కొత్తపల్లి నాగలక్ష్మి, సుంకర దైవకృప ప్రభుత్వ గృహనిర్మాణ పథకంలో 2009లో ఇళ్లు నిర్మించుకున్నారు. గృహనిర్మాణ బిల్లులు రాలేదని, బిల్లులు మంజూరు చేయడానికి అప్పటి హౌసింగ్ ఏఈ యలమంచిలి ప్రకాశరావు ఒక్కొక్కరి నుంచి రూ.3వేలు చొప్పున రూ.6వేలు అంచం అడిగారని అదే గ్రామానికి చెందిన బస్వా నాగవెంకటగణేష్ 2009 మార్చి 3న ఏలూరు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. బస్వా నాగవెంకటగణేష్ రూ.6వేలు ఏఈ ప్రకాశరావుకు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కేసు నమోదు చేశారు. అయితే కేసు విచారణలో ఫిర్యాదు నాగవెంకటగణేష్ ఏసీబీ కోర్టు జడ్జి ఎదుట తప్పుడు సాక్ష్యం ఇచ్చాడు. దీనిపై రాజమహేంద్రవరం 3వ అదనపు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో తప్పుడు సాక్ష్యం చెప్పినందుకు నాగవెంకటగణేష్‌పై కేసు నమోదు చేశారు. మెజిస్ట్రేట్ కేసు విచారించి, ఏసీబీ కోర్టులో తప్పుడు సాక్షం చెప్పినట్టు నిర్ధారించి ఏడాది జైలు, రూ.5000 జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పినట్టు ఏసీబీ అధికారులు తెలిపారు.

పాముకాటుకు వివాహిత మృతి

కరప, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం గురజనాపల్లిలో పాము కరిచి వివాహిత మృతిచెందినట్టు ఎస్ఐ తోట సునీత తెలిపారు. గ్రామానికి చెందిన బోనంగి లోవ తల్లి అనే మహిళ ఈనెల 3న ఇంట్లో వంట చేస్తుండగా పాము కరిచింది. అపస్మారకస్థితిలో ఉన్న ఆమెను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందింది. మృతురాలి సోదరి రాచకొండ శ్రీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వివరించారు.

డాక్టర్ శర్మకు సీఎంఏ సదస్సు ఆహ్వానం


మాట్లాడుతున్న డాక్టర్ సత్యనారాయణశర్మ

అమలాపురం, జూలై 7(ఆంధ్రజ్యోతి): 56 సభ్య దేశాలు కలిగిన కామన్‌వెల్త్ మెడికల్ అసోసియేషన్ (సీఎంఏ) సర్వ సభ్య సమావేశానికి కోనసీమ జిల్లా అమలాపురం పట్టణానికి చెందిన డాక్టర్ పప్పు సత్యనారాయణశర్మకు ప్రత్యేక ఆహ్వానం అందింది. ఈనెల18న లండన్‌లో జరిగే సదస్సుకు సీఎంఏ అధ్యక్షుడు డాక్టర్ జేఏ లాల్ నుంచి లేఖ అందినట్టు శర్మ సోమవారం అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో వివరించారు. కామన్వెల్త్ మెడికల్ అసోసియేషన్ స్టాప్ టీబీ ఇనీషియేటివ్ సబ్ కమిటీలో డాక్టర్ శర్మ సభ్యుడిగా కొనసాగుతున్నారు. గత 2 దశాబ్దాలుగా క్షయవ్యాధి నిర్మూలన కోసం వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ఆయన చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఉపసంఘంలో సభ్యత్వం లభించినట్టు వెల్లడించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన పిలుపు మేరకు 2023 నాటికి క్షయ వ్యాధిని నిర్మూలించేందుకు సభ్య దేశాల ప్రతినిధులు కృషి చేస్తున్నారని శర్మ వివరించారు. దేశవ్యాప్తంగా అంతర్జాతీయ సదస్సుకు 25 మంది హాజరవుతుండగా ఆంధ్రప్రదేశ్ నుంచి డాక్టర్ శర్మకు మాత్రమే ప్రత్యేక గుర్తింపుతో ఈ ఆహ్వానం అందింది. డాక్టర్ శర్మ ప్రస్తుతం జాతీయ వైద్య సంఘం క్షయవ్యాధి నిర్మూలనా సంఘం కోచైర్మన్‌గా, రాష్ట్ర ఉపసంఘం కన్వీనర్‌గా పనిచేస్తున్నారు. 2026-27 సంవత్సరానికి ఐ ఎంఏ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ శర్మ ఎన్నిక కావడం విశేషం. అంతర్జాతీయ సదస్సుకు హాజరవుతున్న డాక్టర్ శర్మను పలువురు అభినందించారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న 3 మోటారుసైకిళ్ల స్వాధీనం

కొవ్వూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): అక్రమంగా రేషన్‌బియ్యం తరలిస్తున్న 3 మోటారుసైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు కొవ్వూరు సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్ టీ.సునీత తెలిపారు. సోమవారం తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి వద్ద అధికారులు వాహన తనిఖీ చేపట్టారు. నిడదవోలు పట్టణం, గోపవరం, పురుషోత్తపల్లి, కొవ్వూరు మండలం మద్దూరు నుంచి రాజమహేంద్రవరం వైపు 510 కిలోల బియ్యంతో వెళ్తున్న 3మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే వారిపై 6ఏ కేసులు నమోదు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

అనారోగ్యంతో మస్కట్‌లో మహిళ ఇబ్బందులు


క్షేమంగా రప్పించాలని భర్త వేడుకోలు


పాలెపు దుర్గ

అమలాపురం టౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశమైన మస్కట్‌కు పదకొండు నెలల క్రితం వెళ్లింది. అక్కడ సరైన ఉపాధి చూపించకపోవడంతో తన భార్య అనారోగ్యం బారిన పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఇంటికి పంపించమని వేడుకుంటుంటే రూ.2.50లక్షల సొమ్ములు కట్టాలని ఏజెంట్ చెబుతున్నాడు. అంత ఆర్థిక స్తోమత లేదు. తన భార్యను క్షేమంగా ఇంటికి తీసుకురావాలని కోనసీమ జిల్లా అల్లవరం మండలం కొమరగిరిపట్నానికి చెందిన పాలెపు రాజు వేడుకుంటున్నాడు. కొమరగిరిపట్నానికి చెందిన పాలెపు దుర్గ ఉపాధి నిమిత్తం మస్కట్‌కు వెళ్లింది. అక్కడకు వెళ్లిన మొదట్లో 3నెలల పాటు ఏజెంట్ కార్యాలయంలోనే ఉంది. ఆ తరువాత ఒక ఇంట్లో పనికి కుదిర్చారు. ఆ ఇంటి యజమానికి మతిస్థిమితం లేదు. పదేపదే కొరకడం, కొట్టడం చేస్తున్నాడు. దాంతో 4 నెలల పాటు చాలా ఇబ్బందులు పడి అక్కడే పనిచేసింది. ఆ తరువాత ఏజెంట్ కార్యాలయానికి తీసుకొచ్చారు. ఒక మంచి పని చూపించాలని వేడుకున్నా పట్టించుకోలేదు. సరైన వసతులు, ఆహారం లేకుండా అక్కడో పదిరోజులు, ఇక్కడో పది రోజులు పనిచేస్తుండడంతో అనారోగ్యం పాలై ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. భార్య దుర్గ చనిపోయేలా ఉందని ఏజెంట్‌ను వేడుకుని ఇంటికి పంపించమని అడుగుతున్నా రూ.2.50లక్షలు చెల్లించాలంటున్నారని పాలెపు రాజు వాపోయాడు. కూలి పని చేసుకునే తమ వద్ద అంత ఆర్థిక స్తోమత లేదని, తన భార్యను స్వగ్రామానికి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్‌లో రాజు అర్జీ అందించాడు.

పవన్ ఎక్కడ పోటీ చేయమంటే అక్కడే చేస్తా

ముద్రగడ కుమార్తె క్రాంతి


సత్యదేవుడి దర్శనానంతరం క్రాంతి

అన్నవరం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ తనను ఎక్కడ పోటీ చేయమంటే అక్కడ పోటీ చేస్తానని కాపు ఉద్యమనేత ముద్రగడ కుమార్తె క్రాంతి పేర్కొన్నారు. సోమవారం కుటుంబసభ్యులతో కాకినాడ జిల్లా అన్నవరంలో సత్యదేవుడిని దర్శించిన ఆమె విలేకర్లతో మాట్లాడారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రత్తిపాడు జనసేన అభ్యర్థిగా పోటీచేసేందుకు నియోజకవర్గంలో తిరుగుతున్నారనే ప్రచారంపై ఆమె మాట్లాడుతూ ఇటీవల రాజమండ్రి, రావులపాలెంలో పర్యటించానని.. తనకు టిక్కెట్ ఇచ్చేది లేనిది పవన్‌కల్యాణ్ నిర్ణయిస్తారని తెలిపారు. తన తండ్రి ఆరోగ్యం బాగుండాలని స్వామిని కోరుకున్నట్టు తెలిపారు. ఆమెకు ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు.



చీర మేను వేట!

చీర మేను చేపల కోసం రాజమహేంద్రవరం పుష్కర్ ఘాట్ వద్ద పిల్లలు, పెద్దలు చీరలు, చున్నీలతో వేటాడారు. అవి దొరకడంతో బాటిల్స్‌లో నింపి పట్టుకెళ్తున్న దృశ్యాలను ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా.
- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం



అమలాపురం

అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు

బాలమురళీకృష్ణ జయంతి

మలికిపురం, జూలై 7(ఆంధ్రజ్యోతి): మంగళంపల్లి బాలమురళీకృష్ణ 95వ జయంతిని సోమవారం శంకరగుప్తంలో బాలమురళీ అభిమానులు నిర్వహించారు. బాలమురళీ సంగీతం కోసం పాటుపడిన పలు అంశాలను గుర్తుచేసుకున్నారు. సర్పంచ్ రాపాక ఆనందకుమార్, శిరిగినీడి నాని, కొమరగిరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల లబ్ధే లక్ష్యం




ముమ్మిడివరం: కరపత్రం అందిస్తున్న ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు
ఉప్పలగుప్తం: గోపవరంలో కరపత్రం అందించి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

- ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు
- పలుచోట్ల 'సుపరిపాలన' కార్యక్రమాలు

ముమ్మిడివరం, జూలై 7(ఆంధ్రజ్యోతి): అర్హత ఉన్న పేదవారికి సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని చేపట్టిందని అమలాపురం ఎంపీ గంటిహరీష్‌మాధుర్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ 4వ వార్డు మార్కెట్ ప్రాంతంలోని 17, 19 బూత్‌ల్లో వార్డు అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలతో కలిసి పర్యటించారు. ప్రభుత్వ పథకాలు వివరించి వాటి బ్రోచర్లను అందించారు. కార్యక్రమంలో నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, చెల్లి అశోక్, ముదునూరి రామలింగరాజు, గొలకోటి దొరబాబు, తాడి నరసింహారావు, దొమ్మేటి రమణకుమార్, అర్థాని శ్రీనివాసరావు, ములపర్తి బాలకృష్ణ, దివి మహాలక్ష్మి, పిల్లి నాగరాజు, గొల్లపల్లి గోపి, దివి విజయ్, లోకినీడి వెంకటేశ్వరరావు, విళ్ల వీరాస్వామినాయుడు, కాకి మాణిక్యం, వాసంశెట్టి అమ్మాజీ, ర్యాలీ ప్రసాద్, జాగు సత్తిబాబు, బొక్కా రుక్మిణి, మెండి కమల, కుడుపూడి మల్లేశ్వరి, అత్తిలి లక్ష్మీప్రసన్న, నిమ్మకాయల విశ్వేశ్వరరావు, నడింపల్లి శ్రీనివాసరాజు, గోరింట శ్రీనురాజు, జాగు రాంబాబు, పాయసం చిన్నీ, పితాని నరసింహమూర్తి, రెడ్డి శ్రీను పాల్గొన్నారు.

వాగ్దానాలు అమలు చేస్తోన్న ప్రభుత్వం

రాజోలు, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఎన్నికల వాగ్దానాలను ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అమలుచేస్తోందని శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్ అన్నారు. పొన్నమండలో జరుగుతున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో షరీఫ్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం సోమవారం పాల్గొని ఇంటింటికీ తిరుగుతూ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ గతంలో మునుపెన్నడూ లేని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం చేపడుతోందన్నారు. ఉచిత గ్యాస్ విధానాన్ని అమలుచేసిందని, త్వరలో అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు, ఆడబిడ్డ పెట్టుబడి వంటి అద్భుతమైన పథకాలను ప్రజలు అందించబోతున్నామని తెలిపారు. టీడీపీ రాజోలు నియోజకవర్గ పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు, మందాల గంగసూర్యనారాయణ, సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీచైర్మన్ గుబ్బల శ్రీనివాస్, చాగంటి స్వామి, ముప్పర్తి నాని, చెల్లుబోయిన శ్రీనివాస్, తాడి సత్యనారాయణ, దాకే ఏడుకొండలు, మోకా ఏడుకొండలు, అడబాల విజయ్, కడలి రమేష్ , కడలి మోహన్ పాల్గొన్నారు.

సుపరిపాలనతో గ్రామాల అభివృద్ధి

అల్లవరం జూలై 7(ఆంధ్రజ్యోతి): టీడీపీ సుపరిపాలనలో గ్రామాలు అభివృద్ధి చెందిన తొలి అడుగు కార్యక్రమాల ద్వారా సమస్యలు పరిష్కారమవుతున్నాయని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. సోమవారం రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు ఆధ్వర్యంలో గోడితిప్పలో టీడీపీ సుపరిపాలన ప్రచారం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, కడలి వెంకటేశ్వరరావు, అధికారి జయవెంకటలక్ష్మి, మండల కార్యదర్శి పచ్చిమాల ఏడుకొండలు, మేడిద శంకరరావు, బసవా సింహాద్రి, వేగిరాజు శ్రీనురాజు, కొప్పాడి ఈశ్వరరావు పాల్గొన్నారు.

సుపరిపాలనలో తొలిఅడుగు

అమలాపురం రూరల్, జూలై7(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం సోమవారం ఇమ్మిడివరప్పాడు గ్రామంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలు పంచి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మాజీ జడ్పీటీసీ అధికారి జయవెంకటలక్ష్మి, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు చొల్లంగి సత్యసాయిబాబు, మాజీ అధ్యక్షుడు మల్లుల పోలయ్య, మంద గెద్దయ్య, యలగన శ్రీనివాసరావు, శనగన మల్లేశ్వరరావు, ఈతకోట నాగేశ్వరరావు, తిరుమనాథం మురళీ, మంద దుర్గారావు, వంకయాల ప్రసాద్ పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా ప్రభుత్వం

ఉప్పలగుప్తం, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఏడాది సుపరిపాలనలో కూటమి ప్రభుత్వం నిరుపేదలకు అండగా నిలిచిందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. గోపవరంలో సోమవారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యకర్తలతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలను అందించారు. ఏడాది పాలనపై యువత, మహిళల అభిప్రాయాలను సేకరించారు. టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు పెమ్మిరెడ్డి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, నీటిసంఘం అధ్యక్షుడు ఆకుల వెంకటరమణ, పార్టీ ప్రధాన కార్యదర్శి పండు వెంకటేశ్వరరావు, తెలుగు యువత మండల అధ్యక్షుడు ఆకేటి పెద్ద, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు గుత్తుల నాగేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ అధికారి జయలక్ష్మి, కూటమి నాయకులు పెయ్యల దుర్గారావు, అయితాబత్తుల వెంకటకృష్ణారావు, సాకా రాంబాబు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి కె.బి.సామ్రాట్‌మధు

అమలాపురంటౌన్, జూలై7(ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవ సభను సోమవారం రాత్రి అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో నిర్వహించారు. అనేక ప్రాంతాల నుంచి మాదిగ యువత అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆకుమర్తి రమేష్, గంపల సత్యప్రసాద్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఆవిర్భావ దినోత్సవ సభలో ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణరావు, జిల్లా అధ్యక్షుడు సవరపు భైరవమూర్తి, ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుమర్తి మోహన్, ఇన్‌చార్జి సామ్రాట్ మధు, కోఇన్‌చార్జి డాన్‌సూరిమాదిగ, సత్తాల దుర్గారావు, చుట్టుగుళ్ల సత్తిబాబు, యార్లగడ్డ రామకృష్ణ, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, పిండి రాజా, ఆకుమర్తి ఆశీర్వాదం, నేదునూరి నతానియేలు, గంపల విజయ్, మంద రామకృష్ణ తదితర ప్రముఖులు మాట్లాడారు. ఎస్సీ అనుబంధ కులాలకు న్యాయం జరగాలంటూ ఎమ్మార్పీఎస్ మూడు దశాబ్దాల క్రితం మంద కృష్ణమాదిగ స్థాపించారన్నారు. ఆయన ఆశయాలు ఫలించి దేశవ్యాప్తంగా ఎస్సీ వర్గీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వచ్చి చేపట్టడం అభినందనీయమన్నారు. మాదిగ అనుబంధ కులాలు దశాబ్దాల కాలంగా అణచివేతకు గురయ్యారన్నారు. వర్గీకరణ ఉద్యమంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పేదలు, దివ్యాంగుల సంక్షేమం కోసం కృష్ణమాదిగ ఎన్నో ఉద్యమాలు చేపట్టి విజయం సాధించారని ప్రశంసించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం, మందకృష్ణమాదిగ జన్మదినాన్ని పురస్కరించుకుని పెద్దఎత్తున సంబరాలు జరిపి బాణసంచా కాల్చారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేశారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలతో పాటు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ పుట్టినరోజు వేడుకలను మామిడికుదురులో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండు కూడలిలో ఎమ్మార్పీఎస్ పతాకాన్ని జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు ఆవిష్కరణ చేశారు. కృష్ణమాదిగ పుట్టినరోజును పురస్కరించుకుని కేక్ కట్‌చేసి అభిమానులకు పంచారు. ఎమ్మార్పీఎస్ నాయకులు నూటుకుర్తి సత్యనారాయణ, ఉండ్రాజవరపు శివ,చాట్ల సత్యనారాయణ, మందా గాంధీ, చుట్టుగుళ్ల కిశోర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం, (ఆంధ్రజ్యోతి): కొత్తమురమళ్ళ పెద్దపేటలో సోమవారం ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ 60వ పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. వీరేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ జంపన బాబు, టీడీపీ నాయకుడు దాట్ల రామకృష్ణంరాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పలివెల త్రినాథ్, యూవీ కిశోర్ బాబు, యు.ఈశ్వరీబాయి పాల్గొన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం, మందా కృష్ణమాదిగ జన్మదిన వేడుకలను గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. అంబాజీపేట బస్టాండ్ ఎదుట ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేక్‌కట్ చేశారు. జాతీయ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కె.పెదపూడి, గంగలకుర్రు అగ్రహారం గ్రామాల్లో బాణసంచా కాల్చి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, గణపతి వీరరాఘవులు, ఉందుర్తి నాగబాబు, కొర్లపాటి గోపి, బొంతు పెదబాబు, అరిగెల సూరిబాబు, మైపాల తాతాజీ, తొత్తరమూడి గోవిందు, నేదునూరి పెద్దిరాజు పాల్గొన్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం త్రీరోడ్ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా కృష్ణమాదిగ అభిమానులు, కార్యకర్తలు, కూటమి నాయకులు సమక్షంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కేక్ కట్‌చేసి అందరికీ పంచారు. బొంతు పెదబాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, సంసాని పెద్దిరాజు, గణపతి వీరరాఘవులు, తవిటికి బుజ్జి, వాసంశెట్టి కుమార్, పెచ్చెట్టి వెర్రియ్య, గనిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసనలు

కలెక్టరేట్‌లో వినతుల అందజేత




జిల్లా కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధుల నిరసన, హార్టీకల్చర్ అసిస్టెంట్ లక్ష్మితో గ్రామస్థుల నిరసన

అమలాపురంటౌన్, జూలై7(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలువురు సోమవారం కలెక్టరేట్‌లో అర్జీలు అందించారు. కలెక్టరేట్ ఎదుట నిరసనలు తెలిపారు.

అమెరికాలో ఉంటున్నవారి భూములకు ఆధార్ లింకు:

పాలెపు పోచమ్మ-సత్తిబాబు అమెరికాలో నివాసం ఉంటున్న వారి భూములకు పదో తరగతి చదువుతున్న మా పాప మానస ఆధార్ కార్డుకు మూడు ఎకరాల భూమి లింక్ అయింది. అదేవిధంగా పోచమ్మ ఆధార్ కార్డుకు మరో నాలుగు ఎకరాల భూమి లింకు అవ్వడంతో గత వైసీపీ ప్రభుత్వం నుంచి మా కుటుంబంలోని పిల్లలకు అమ్మఒడి, తల్లికి వందనం పథకాలకు దూరమయ్యారు. సమస్యను పరిష్కరించాలని మూడేళ్లుగా పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నా. మా అబ్బాయి ప్రవీణ్‌కుమార్ 7వ తరగతి చదువుతున్నాడు. ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలం తప్ప అదనంగా సెంటుభూమి లేదు. అమెరికాలో ఉన్నవారు స్వగ్రామం వచ్చి వేలిముద్ర వేస్తేనే గానీ తల్లికి వందనం రాదంటున్నారు. మాకు ఆధార్ కార్డులకు లింకైన భూములను తీసివేసి తల్లికి వందనం అందించాలని కలెక్టరేట్‌లో అర్జీ అందించారు.

పేరుకే చంద్రబాబు ఆరోగ్య ఉద్యానవనం: అమలాపురం పురపాలక సంఘ వాకర్స్

ముఖ్యమంత్రి చంద్రబాబు పేరిట అమలాపురం నడిబొడ్డున ఏర్పాటుచేసిన చంద్రబాబు ఆరోగ్య ఉద్యానవనం అది. ఆరు ఎకరాల విస్తీర్ణంలో రూ.2కోట్లతో అభివృద్ధిచేసి ప్రజలకు అంకితమిచ్చిన పార్కులో నేడు ఎవరూ అడుగు పెట్టలేని పరిస్థితికి చేరుకుంది. గత వైసీపీ ప్రభుత్వం చంద్రబాబు పార్కును పట్టించుకోలేదు. దాంతో గడ్డి, తుప్పలు పెరిగిపోయి వాకింగ్ ట్రాక్‌లపై విష సర్పాలు తిరుగుతుండడంతో వాకర్స్ భయపడి పరుగులు తీస్తున్నారు. కనీసం విద్యుత్ లైటు కూడా వెలగడం లేదు. పిల్లలు ఆడుకునే సామగ్రి, ఆట వస్తువులు తుప్పుపట్టి పాడైపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచినా పట్టించుకున్నవారు లేరు. ఆరోగ్య ఉద్యానవనంగా తిరిగి పార్కును పునరుద్ధరించాలని వాకర్స్ అల్లాడ వెంకటరమణ, దంగేటి ప్రసాద్, ఖ్వాజాబాబు, ఉప్పుగంటి సూర్యవెంకటజగన్నాథరావు, పాల శ్రీను, దుర్గారావుఅర్జీ అందించారు.

అప్పులకు వడ్డీలు కూడా కట్టలేని పరిస్థితి: కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు

ప్రభుత్వ ఆదేశాలతో అప్పులుచేసి అభివృద్ధి పనులు చేశాం. మూడేళ్లుగా ఏవిధమైన బిల్లులు చెల్లించలేదు. చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక పోతున్నాం. వైసీపీ ప్రభుత్వం నుంచి బిల్లుల బకాయిలు నిలిచిపోయాయి. జిల్లా పరిషత్ గ్రాంట్లతో జిల్లా వ్యాప్తంగా రూ.6కోట్లతో వివిధ అభివృద్ధి పనులుచేసి బిల్లుల కోసం ఎదురుచూస్తున్నాం. వడ్డీల భారంతో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయాం. అప్పులు ఇచ్చినవారు దౌర్జన్యాలకు దిగుతున్నారు. వారికి సమాధానం చెప్పలేని పరిస్థితి. బిల్లులను చెల్లించి ఆదుకోవాలని కాంట్రాక్టర్ల అసోసియేషన్ జిల్లాశాఖ ప్రతినిధులు అల్లాడ వెంకటరమణ, నిమ్మకాయల కృష్ణ, బళ్ల బ్రహ్మాజీ, సామ బుజ్జి, రాయపురెడ్డి శ్రీను, బొంతు బాలకృష్ణ, రాజులపూడి గణేష్, గంధం బ్రహ్మానందం, అడ్డగళ్ల సాయిరామ్ తదితరులు అర్జీ అందించి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు.

శిరోముండనం బాధితులకు పరిహారం అందించాలి:

వెంకటాయపాలెం శిరోముండనం బాధితులు

మూడు దశాబ్దాలు గడిచినా రామచంద్రపురం మండలం వెంకటాయపాలెం శిరోముండనం బాధితులకు ఇంతవరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం ఏవిధమైన పరిహారం అందలేదు. 24ఏళ్లుగా విశాఖపట్నంలోని ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టుకు సొంత ఖర్చులతో అప్పులు చేసుకుని హాజరవుతున్నాం. టీఏ, డీఏలు కూడా చెల్లించలేదు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చొరవతో తమకు ఎస్సీ కులధ్రువీకరణ పత్రాలు అందించారు. ఇప్పటికైనా నష్టపరిహారం, టీఏ, డీఏలను చెల్లించాలని శిరోముండనం బాధితులు కోటి చినరాజు, చల్లపూడి పట్టాభిరామయ్య, దడాల వెంకటరత్నం కోరుతున్నారు.

కౌన్సెలింగ్‌లో కోరుకున్న స్థానం ఇచ్చి: హార్టీకల్చర్ అసిస్టెంట్ లక్ష్మితో గ్రామస్తుల నిరసన

ఉద్యానశాఖకు సంబంధించి హార్టీకల్చర్ అసిస్టెంట్ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ గత నెల 29న బొమ్మూరులో పూర్తి చేశారు. ప్రజాప్రతినిధుల సిఫార్సులను పరిగణలోనికి తీసుకోమని, మెరిట్ ఆధారంగానే బదిలీలు జరుగుతాయని చెప్పారు. దాంతో ఎవరి సిఫార్సు లేకుండా తాను వచ్చిన ర్యాంకులను నమ్ముకుని రంపా లక్ష్మి అవిడి-2, వానపల్లి-1, మోడేకుర్రు-1 సచివాలయాలకు బదిలీ ఆప్షన్లు పెట్టుకుంది. కౌన్సిలింగ్‌లో ముందు వరుసలోఉన్న లక్ష్మికి అవిడి-2ను కేటాయించినట్టు చెప్పడంతో ఆమె వెనుదిరిగింది. ఆ తరువాత ఆమెకు సఖినేటిపల్లికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇవ్వడంతో ఖంగుతింది. అధికారులను సంప్రదించగా ఎమ్మెల్యే సిఫార్సు కారణంగా అలా చేయాల్సి వచ్చిందని చెప్పడంతో ఆమె కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరు చిన్న పిల్లలతో ఉన్న లక్ష్మి కలెక్టరేట్‌లో తనకు జరిగిన అన్యాయంపై అర్జీ అందించి గ్రామస్తులతో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపింది.

సమస్యల పరిష్కారానికి మానవహారం



రహదారిపై మానవహారం నిర్వహిస్తున్న మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులు

ముమ్మిడివరం, జూలై 7(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ముమ్మిడివరంలో వారు మానవహారం, నిరసన చేపట్టారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు పెట్టా శివప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసుస్టేషన్ ఎదుట రోడ్డుపై మానవహారం నిర్వహించారు. ఇంజనీరింగ్ కార్మికులకు జీవో 36 ప్రకారం జీతాలు పెంచాలని, 17రోజుల సమ్మెకాలపు ఒప్పందాలపై జీవో ఇవ్వాలని వారు నినాదాలు చేశారు. అనంతరం వారంతా ముమ్మిడివరంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమానికి విచ్చేసిన ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబులకు వినతిపత్రం అందించారు. ప్రభుత్వం స్పందించకపోతే 13వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళతామని తెలియజేశారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని ఎంపీ, ఎమ్మెల్యేలు హామీ ఇచ్చారు. అనంతరం కమిషనర్ పి.రవివర్మకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు, వి.వెంకటేశ్వర్లు, ఎస్.అజయ్‌కుమార్, ఎ.సత్తిబాబు, జి.రమేష్, కె.గోవిందరాజు, వి.ప్రసాద్, ఆర్.అరుణ, వై.రమణ, కె.వెంకటశివ, కె.శరత్, జి.ప్రదీప్, జి.వెంకటేశ్వరరావు, ఎస్.రామరాజు, కె.శ్రీనివాసరావు, సీహెచ్ వెంకటేశ్వరరావు, ఎస్.బొజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

సవరించిన విద్యుత్ బిల్లు

మలికిపురం, జూలై 7(ఆంధ్రజ్యోతి): మలికిపురంలో ఒక షాపింగ్ కాంప్లెక్సులో ఉన్న బట్టల షాపునకు జూలై నెల విద్యుత్ బిల్లు రూ.3,38,496 వచ్చింది. విద్యుత్ అధికారులు ఈబిల్లును సరిచేశారు. అధికారులు పాత మీటరు స్థానంలో కొత్త మీటరు మార్చినందున పాత మీటరులో ఉన్న మొత్తం రీడింగ్ నమోదై ఇంత మొత్తంలో బిల్లు వచ్చిందని ఆ దుకాణాన్ని సోమవారం విద్యుత్‌శాఖ ఏడీఈ తనిఖీ చేసి లోడును లెక్కించి మొత్తం బిల్లును ఏడు నెలలకు సర్దుబాటుచేసి, సవరణచేసి రూ.7,855కు తగ్గించి వినియోగదారునికి తెలిపారు. విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఈసవరించిన బిల్లును పత్రికలకు విడుదల చేశారు.

కోనసీమ అభివృద్ధికి ఆద్యుడు కళా వెంకట్రావు

అమలాపురం టౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో అపర చాణుక్యుడిగా జాతీయస్థాయి గుర్తింపును పొందడంతో పాటు కోనసీమ అభివృద్ధికి ఆద్యుడిగా కళా వెంకట్రావు చరిత్రలో నిలిచిపోతారని కళా వెంకట్రావు మేనల్లుడు దువ్వూరి లక్ష్మీనారాయణ సోమయాజులు పేర్కొన్నారు. వడ్డిగూడెంలోని శ్రేయ ప్రత్యేక ప్రతిభావంతుల పాఠశాల ఆవరణలో డాక్టర్ శ్రీమన్నారాయణ అధ్యక్షతన కళా వెంకట్రావు జయంతి సభ సోమవారం నిర్వహించారు. కోనసీమ అభివృద్ధికి దశాబ్దాల కాలం క్రితమే బాటలు వేసిన మహనీయుడిగా వక్తలు కళా వెంకట్రావు సేవలను కొనియాడారు. జయంతి సభలో ఆయన మనుమలైన కళా వెంకట్రావు, సుభాషిణి, జితేంద్రతో పాటు దువ్వూరి లక్ష్మీనారాయణ, డాక్టర్ ఆకెళ్ల వెంకట్రావు, దువ్వూరి సుబ్బలక్ష్మి, సప్పా నాగేశ్వరరావు, కళా వెంకటసుబ్రహ్మణ్యచిట్టి, పేరి లలిత, మహిళా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు, కోనసీమ మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు. కళా వెంకట్రావు జీవిత చరిత్రను పాట రూపంలో పేరి లలిత ఆవిష్కరించారు. పుత్సా కృష్ణకామేశ్వర్ పర్యవేక్షణలో సభ జరిగింది. అదేవిధంగా కూచిమంచి అగ్రహారంలోని కళా వెంకట్రావు విగ్రహానికి కోనసీమ జేఏసీ కన్వీనర్ బండారు రామ్మోహనరావు ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మంత్రిప్రగడ వేణుగోపాల్, డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి, సీలి సంసోను, మాచిరాజు వాసు, టి.సుందరరామయ్య, మంగిపూడి శాస్త్రి, నల్లా నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'దళితులపై పెరిగిన అత్యాచారాలు'

అమలాపురం టౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దళితులపై అత్యాచారాలు, అమానుష చర్యలు అంతకంతకు పెరిగిపోతున్నాయని భారత రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డీబీ లోక్ ఆరోపించారు. సీఎం చంద్రబాబు సొంత జిల్లాలోనే కుల రాక్షసి విలయ తాండవం చేస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో దళితులపై జరుగుతున్న దాడులను వివరించారు. కూటమి నాయకుల మద్దతుతోనే దాడులు పెరిగిపోయాయని పోలీసు వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని విమర్శించారు. సోమవారం అమలాపురం అరిగెలపాలెంలో నిర్వహించిన ఆర్పీఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఉండ్రు శ్యామలారావు, ఈవీవీ సత్యనారాయణ, దోనిపాటి నాగేశ్వరరావు, కాశి వెంకట్రావు, గోసంగి ఆనందరావు, పెయ్యల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ముమ్మిడివరం, జూలై 7(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. ముమ్మిడివరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 84అంగన్‌వాడీలకు ప్రభుత్వం సమకూర్చిన టీవీలను ఎంపీ, ఎమ్మెల్యేల పంపిణీ చేశారు. ఈసందర్భంగా సోమవారం సీడీపీవో ఎం.నిహారిక అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యేలు పాల్గొని మాట్లాడారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గుత్తుల సాయి, చెల్లి అశోక్, గొలకోటి దొరబాబు, నాగిడి నాగేశ్వరరావు, తాడి నరసింహారావు, దొమ్మేటి రమణకుమార్, అర్థాని శ్రీనివాసరావు, ములపర్తి బాలకృష్ణ, దివి మహాలక్ష్మి, గొల్లపల్లి గోపి, పిల్లి నాగరాజు, దివి విజయ్, లోకినీడి వెంకటేశ్వరరావు, ముమ్మిడివరం పర్యవేక్షకులు సీహెచ్ పల్లవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతకు శిక్షణ, ఉద్యోగావకాశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ముమ్మిడివరం, జూలై 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో స్కిల్ హబ్‌లు ఏర్పాటుచేసి నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డి.హరిశేషు తెలిపారు. స్థానిక పరిశ్రమలవారి సహకారంతో ఇండస్ట్రీయల్ నైపుణ్యత కలిగిన ఉపాధ్యాయులతో నూతన సాంకేతికాలను ఉపయోగించి అభ్యర్థులకు శిక్షణ ఇప్పిస్తామన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. జిల్లాలో ఫేజ్-2కుగాను ముమ్మిడివరం నియోజకవర్గానికి సంబంధించి ఆఫీసు అసిస్టెంట్, ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషియన్, మల్టీస్కిల్ టెక్నీషియన్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, బీటెక్ చదివిన అభ్యర్థులు పేర్లను ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి కార్యాలయంలో నమోదు చేసుకోవాలన్నారు. పేర్లు నమోదు చేయించుకున్న వారికి ముమ్మిడివరంలో శిక్షణ ఇస్తామన్నారు. వివరాలకు యు.శ్రీదేవి సెల్ 9491681050, కె.త్రినాథ్ 9603410995లలో సంప్రదించాలన్నారు.

రాజోలు రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఆంజనేయులు

రాజోలు, జూలై7(ఆంధ్రజ్యోతి): రాజోలు రోటరీ క్లబ్ నూతనఅధ్యక్షుడుగా తాటిపాక సోమిశెట్టి ల్యాండ్‌మార్కు అధినేత, రాజోలు మండలం ములికిపల్లికి చెందిన సోమిశెట్టి ఆంజనేయులు ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం రాజోలు రోటరీ క్లబ్‌లో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్.సత్యనారాయణ పాల్గొన్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా ఆంజనేయులు, కార్యదర్శిగా నామన షణ్ముకేశ్వరరావు, కోశాధికారిగా చిట్నీడి లక్ష్మణరావు, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యవర్గాన్ని అసిస్టెంట్ గవర్నర్ గన్నాబత్తుల సత్యవతి, గుండుబోగుల పెద్దకాపు, దార్లపెద బాబు, కసుకుర్తి రామకృష్ణ, ఏడిద కవీంద్ర, నాని, తాటికాయల శ్రీరామయ్యప్పనాయుడు, ఎంపీటీసీ చెల్లింగి లక్ష్మీశ్వరి, వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, కాసు శ్రీనివాస్, అడబాల బుజ్జి అభినందనలు తెలిపారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

అంతర్వేది, జూలై 7(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు హైదరాబాద్ సోమాజిగూడకు చెందిన సీవీ వాసుదేవ రాయ్-ఉషారాయ్ దంపతులు రూ.1,01,116 విరాళం అందించారు.

ఐ.పోలవరం, (ఆంధ్రజ్యోతి): మురమళ్ళ శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి అన్నదాన ట్రస్టుకు పోరంకి వాస్తవ్యులు దేవునిపల్లి రాంబాబు, పద్మావతి దంపతులు రూ.50వేలు విరాళాన్ని సోమవారం ఆలయ పర్యవేక్షకుడు కటారి శ్రీనివాసరాజుకు అందించారు.

రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు



డ్రోన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, జూలై 7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టిందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. స్థానిక జనసేన క్యాంపు కార్యాలయంలో అంబాజీపేటకు చెందిన కృషివల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ గ్రూపు, ముంగండకు చెందిన వాసవి కిసాన్ గ్రూపులకు రెండు కిసాన్ డ్రోన్లను ఎమ్మెల్యే అందించారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు ఎస్ఎంఏఎం ద్వారా రూ.71.60లక్షలు విలువైన ట్రాక్టర్లు, పవర్‌టిల్లర్లు, బ్రస్‌కటర్స్ తదితర యంత్ర పరికరాలను అందించామన్నారు. పంట చేల్లో డ్రోన్‌ను ఎలా వినియోగించాలో డెమో ద్వారా వ్యవసాయశాఖ అధికారులు చూపించారు. ఇన్‌చార్జ్ ఏడీ సీహెచ్‌డీ విజయకుమార్, ఏవో కె.ధర్మప్రసాద్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, బొంతు పెదబాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, గణపతి వీర రాఘవులు, సంసాని పెద్దిరాజు, వాసంశెట్టి కుమార్, నాగాబత్తుల సుబ్బా రావు, పెచ్చెట్టి వెర్రియ్య, ముత్యాల జమ్మిలు, వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా జాన్‌మోషే



మలికిపురం, జూలై 7(ఆంధ్రజ్యోతి): బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా బూసి జాన్‌మోషేను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు బి.గౌతమ్‌కుమార్ ఉత్తర్వులు ఇచ్చారు. విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి బహుజన సమాజ్‌పార్టీ సమావేశంలో బాధ్యతలు అప్పగించారని సోమవారం ఆయన తెలిపారు. సమావేశంలో జాతీయ కోఆర్డినేటర్, ఏపీ ఇన్‌చార్జి రాజారామ్, రాజ్యసభ మాజీ సభ్యుడు అతార్‌సింగ్ తదితరులు పాల్గొన్నట్టు ఆయన చెప్పారు.

మంద కృష్ణమాదిగ పుట్టినరోజు వేడుక

అల్లవరం జూలై7(ఆంధ్రజ్యోతి): మాదిగల హక్కుల కోసం పోరాడిన యోధుడు మంద కృష్ణమాదిగ అని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. సోమవారం కోడూరుపాడు, గోడి గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మంద కృష్ణమాదిగ పుట్టినరోజు సందర్భంగా జెండాను ఆవిష్కరించి కేక్‌ను కట్ చేశారు. డాక్టర్ కేపీ మధు సామ్రాట్, డాన్‌సూరి, గుబ్బల రాంప్రసాద్, లూటుకుర్తి చిన్నా, ఆకుమర్తి మోహన్, ఎం.సుధీర్, చాట్ల సత్యనారాయణ, యార్లగడ్డ రామకృష్ణ, మంద రామకృష్ణ పాల్గొన్నారు.

రుచికర భోజనం అందించాలి

రాజోలు, జూలై 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని విశ్రాంత ఎంఈవో జొన్నలగడ్డ గోపాలకృష్ణ, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు వడ్లమూడి ప్రకాశరావు ప్రధానోపాధ్యాయులకు సూచించారు. బీజేపీ పిలుపు మేరకు తాటిపాక జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని సోమవారం వారు పరిశీలించారు. ప్రతీరోజు భోజనం, కూరలు రుచికరంగా ఉంటున్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో దేవళ్ల మాణిక్యాలరావు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించాలి

అంబాజీపేట, జూలై 7(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఈపీడీసీఎల్ చీఫ్ మేనేజర్ పెట్టా వెంకటేశ్వరరావును విశాఖపట్నం కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ జిల్లా మోనటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు నేలపూడి స్టాలిన్‌బాబు కోరారు. కోనసీమ ప్రాంతానికి చెందిన వెంకటేశ్వరరావును స్టాలిన్‌బాబు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నిరుపేద, దళితులకు ఉచిత విద్యుత్‌ను, దళిత కాలనీలకు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ ద్వారా విద్యుత్‌ను అందించాలని కోరారు.

'ఇరుకు గదుల్లో విద్యార్థులకు వసతి'

రాజోలు, జూలై 7(ఆంధ్రజ్యోతి): రాజోలు సాంఘిక సంక్షేమశాఖ బాలుర ఎస్సీ నంబరు-1 వసతిగృహంపై ఉన్న శ్లాబ్‌ను తొలగించి ఇరుకుగా ఉన్న షెడ్డులోని రెండు ఇరుకు గదుల్లో 50మంది విద్యార్థులకు వసతి ఏర్పాటు చేయడంపై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల దళిత చైతన్యవేదిక నాయకులు తహశీల్దార్ సీహెచ్ భాస్కర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు చిలకపాటి శ్రీధర్, జేఏసీ మండలాధ్యక్షుడు మట్టా సురేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు వసతులు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ కార్యనిర్వాహక కార్యదర్శి చింతా శ్రీనివాస్, మందా శ్రీను, బి.వినయ్ పాల్గొన్నారు.

శాశ్వత పరిష్కారం చూపి ఆదుకోండి

మామిడికుదురు, జూలై 7(ఆంధ్రజ్యోతి): తమ పొలాలను ముంచెత్తుతున్న ముంపు నీటి నుంచి శాశ్వత పరిష్కారం చూపించాలని పాశర్లపూడి, పాశర్లపూడి రైతులు సోమవారం అమలాపురం ఆర్డీవో కె.మాధవికి విన్నవించారు. వాడబోధి మీడియం డ్రెయిన్ ద్వారా వస్తున్న ఉప్పునీటి వల్ల పాశర్లపూడిలో తమ వరిచేలు ఉప్పునీటి మయం అవుతున్నాయని, కొబ్బరిచెట్లు తలలు వాల్చేసి పనికి రాకుండాపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఓఎన్జీసీ సంస్థ తమ కార్యకలాపాల నిమిత్తం ఏర్పాటుచేసిన రోడ్ల వల్ల ముంపునీరు ఎటూ దిగని పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ఓఎన్జీసీ అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆర్డీవో హామీ ఇచ్చినట్టు రైతులు తెలిపారు. వేగి లక్ష్మీనారాయణ, రాయపురెడ్డి శ్రీను, కోలా సత్యనారాయణ, గంధం స్వామినాయుడు పాల్గొన్నారు.

బీజేపీ సీనియర్ నేత వెంకట్రావు మృతి



మామిడికుదురు, జూలై 7(ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నేత, మాజీ సర్పంచ్ పోసంశెట్టి వాసు తండ్రి కొమరాడ గ్రామానికి చెందిన పోసంశెట్టి వెంకట్రావు అనారోగ్యంతో ఆదివారం రాత్రి మరణించారు. వెంకట్రావు మృతదేహంపై బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ వేమా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం బీజేపీ జెండాను కప్పి నివాళులర్పించారు. జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు భైరిశెట్టి రామకృష్ణ, వర్ధినేని బాబ్జి తదితరులు మాజీ సర్పంచ్‌ను పరామర్శించి ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మున్సిపల్ ఉద్యోగుల ఆందోళన

యానాం, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వేతనాలు అందించకపోవడంతో యానాం మున్సిపల్ ఉద్యోగులు స్థానిక పరిపాలనాధికారి కార్యాలయం సమీపంలో టెంటు వేసి ఆందోళన చేపట్టారు. అలాగే విశ్రాంతి ఉద్యోగులకు బకాయి వేతనాలు అందించాలని వారు డిమాండ్ చేశారు. విశ్రాంతి ఉద్యోగులు, నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

శృంగవృక్షం నుంచి పిఠాపురానికి పాదయాత్ర



పిఠాపురానికి పాదయాత్రగా వెళుతున్న సరస్వతి మహరాజ్ బృందం

ఆలమూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మపరిరక్షణకు 19 ఏళ్లుగా పశ్చిమ గోదావరి జిల్లా శృంగవృక్షం నుంచి పిఠాపురం దత్త పీఠానికి పాదయాత్ర సాగిస్తున్నట్టు శృంగవృక్షం పీఠాధిపతి సాయిదత్త నాగనంద సరస్వతి మహరాజ్ తెలిపారు. సోమవారం తన శిష్య బృందంతో ఆలమూరుకు పాదయాత్ర చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి ఏకాదశి నాడు యాత్ర ప్రారంభమైందని నాలుగు రోజుల్లో పిఠాపురం దత్త క్షేత్రానికి చేరుకుంటామని తెలిపారు. ప్రజలను చైతన్యవంతం చేయడానికి పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్రమం తప్పకుండా 19 ఏళ్ల నుంచి యాత్ర సాగిస్తున్నామన్నారు. పాదయాత్ర సమయంలో దారిలో అనేక మంది తమతో పాదయాత్ర సాగిస్తున్నారని చెప్పారు. బుధవారం నాటికి పిఠాపురం దత్త పీఠానికి చేరుకోనున్నట్టు ఆయన వివరించారు.



నూకాంబిక ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

చింతలూరులో సామూహిక కుంకుమార్చనలు

ఆలమూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయంలో అమ్మవారి జన్మనక్షత్రం సందర్భంగా సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. దేవస్థానం ఆలయ కార్యనిర్వహణాధికారి ఉండవల్లి వీర్రాజుచౌదరి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన సామూహిక కుంకుమార్చనలో వివిధ గ్రామాల నుంచి మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజలు చేశారు. కుంకుమ పూజలకు సంబంధించిన పూజా సామగ్రిని ఆలయ సిబ్బంది సమకూర్చారు. పురోహితులు ఆయా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.5.09 లక్షలు

ఆత్రేయపురం, జూలై 7(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.5,09,997 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన పమ్మి మురళి, మమత దంపతులు రూ.50,001 విరాళం ఇచ్చారు. దాతలకు ఈవో స్వామివారి చిత్రపటం అందచేశారు.

కుప్పకూలిన మురుగునీటి కాల్వ వంతెన పరిశీలన



పినపళ్ల వద్ద కూలిన వంతెనను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

ఆలమూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): పినపళ్ల వద్ద పెనికేరు-గుమ్మిలేరు మురుగునీటి కాలువపై కూప్పకూలిన వంతెనను ఇరిగేషన్ డ్రైనేజి శాఖ అధికారులు, సాగునీటి సంఘం ప్రతినిధులు సోమవారం పరిశీలించారు. ఇరిగేషన్ డిప్యూటీ ఇంజనీరు పోసారావు, అసిస్టెంట్ ఇంజనీరు సుబ్రహ్మణ్యంలకు చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు తెలియజేయడంతో వారు స్వయంగా వచ్చి పరిస్థితిని పరిశీలించారు. నూతన వంతెన నిర్మాణానికి రూ.50 లక్షల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా మార్గం ఏర్పాటు చేయాలని గారపాటి శ్రీనివాస్ సూచించడంతో ఆమేరకు ఏర్పాట్లు చేస్తామని వారు హామీ ఇచ్చారు. నిధుల కేటాయింపుపై ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో చర్చించనున్నట్లు నీటి సంఘం అధ్యక్షుడు గారపాటి తెలిపారు.

ఘనంగా కళా వెంకట్రావు జయంతి

రావులపాలెం, జూలై 7(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, ఉమ్మడి మద్రాసు రాష్ట్ర మాజీ రెవెన్యూ శాఖా మంత్రి కళా వెంకట్రావు జయంతిని నిర్వహించారు. రావులపాలెం జాతీయ సెంటర్లో ఉన్న కళా వెంకట్రావు విగ్రహానికి ఆయన మనవడు, ముని మనవడు, కుటుంబ సభ్యులు కళా వెంకట్రావు, సుభాషిణి, భవాని, సూర్యకుమారి, హిమనిస్ నందన్, సాత్విక్ జితేంద్రలు కళా వెంకట్రావు విగ్రహానికి పూలమాలలు వేశారు. వారి కుటుంబ సభ్యులను సత్కరించారు. వెంకట్రావు కాంస్య విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. కోనసీమ, రావులపాలెం ప్రాంతానికి చేసిన అభివృద్ధిని వక్తలు కొనియాడారు. ఆయన మునిమనవుడు కళా వెంకట్రావును దుశ్శాలువా, పూలమాలతో సత్కరించారు.

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): కళా వెంకట్రావు జయంతిని పురస్కరించుకుని పలివెల గాంధీ అధ్యయన సంస్థ అధ్వర్యంలో దుళ్ళ వెంకటేశ్వర్లు నిర్వహించారు. ఈసందర్భంగా కళా వెంకట్రావు విగ్రహాలతో పాటు జాతీయ నాయకులు విగ్రహాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో కంకటాల శ్రీరామమూర్తి, బి.గాంధీ తదితరులు పాల్గొన్నారు.

వరదలపై అధికారులతో సమీక్ష

ఆత్రేయపురం, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు గోదావరిలోకి వరద నీరు పోటెత్తడంతో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని తహశీల్దారు రాజేశ్వరరావు, ఎంపీడీవో వెంకటరామన్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఏర్పాట్లకు చర్యలు చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. తాగునీరు, వైద్యం, పునరావాసం తదితర అంశాలపై చర్చించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న మలేరియా జిల్లా అధికారి

ఆత్రేయపురం, జూలై 7(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మలేరియా జిల్లా అధికారి ఎన్.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ఆత్రేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. రికార్డులను పరిశీలించి సిబ్బందితో సమీక్షించారు. ఉచ్చిలి, వెలిచేరు గ్రామాల్లో పర్యటించారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా నీటినిల్వలు లేకుండా శుభ్రం చేయాలని డ్రైనేజీలను శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను కోరారు. ప్రస్తుతం మలేరియా కేసులు నమోదు కాలేదన్నారు. డెంగ్యూ మాసోత్సవాలలో భాగంగా జిల్లాలోని 22 మండలాల పరిధిలోని గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు, నాగరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎంపిక పట్ల హర్షం

కపిలేశ్వరపురం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండల కమిటీ నూతన అధ్యక్షుడిగా తొలిసారిగా ఎస్సీ వర్గానికి చెందిన గూటం సత్యనారాయణను ఎంపిక చేయడం అభినందనీయమని జడ్పీటీసీ పి.అబ్బు అన్నారు. సోమవారం అంగర వైసీపీ కార్యాలయం వద్ద ఇటీవల నూతనంగా ఎంపికైన మండల కమిటీ అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు గూటం సత్యనారాయణ, ఎంపీటీసీలు అడ్డాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ద్వారపూడిలో రక్తదాన శిబిరం

మండపేట, జూలై 7(ఆంధ్రజ్యోతి): ద్వారపూడి వున్న ఎస్‌వీఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని ట్రస్టీ సుంకర నాని తెలిపారు. తన తండ్రి వెంకటరమణ వర్ధంతిని పురస్కరించుకుని రక్తదాన శిబిరంతోపాటు పలు సేవా కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చిన ప్రభుత్వం

• సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి సుభాష్ • ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించిన ఎమ్మెల్యే వేగుళ్ల

కె.గంగవరం, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత ప్రభుత్వానికే దక్కుతుందని కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని బాలాంత్రం, గుడిగళ్లభాగ గ్రామాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింట ప్రచారం నిర్వహించారు. ప్రజల సమస్యలను మంత్రి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మేడిశెట్టి రవికుమార్, మల్లిపూడి బుజ్జి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సుపరిపాలన కూటమికే సాధ్యం

ఎమ్మెల్యే వేగుళ్ల

రాయవరం, (ఆంధ్రజ్యోతి): సుపరిపాలన కూటమికే సాధ్యమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. సోమవారం పసలపూడి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నల్లమిల్లి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను అందజేశారు. గ్రామంలోని సమస్యలను ఎమ్మెల్యే తెలుసుకున్నారు. గ్రామంలో పర్యటించిన ఆయనకు మహిళలు హారతులు ఇచ్చారు. స్థానిక మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు చేశారు. కార్యక్రమంలో రామచంద్రపురం వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ కర్రి వెంకటరెడ్డి, టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు మల్లిడి సూర్రెడ్డి, నల్లమిల్లి సతీష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నల్లమిల్లి వెంకన్నబాబు, టీడీపీ నాయకులు అనుసూరి శ్రీనివాస్, దొరబాబు తదితరులతో పాటు, అధిక సంఖ్యలో కూటమి నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

నేడు లొల్ల, వెదురుపాకలో తొలి అడుగు కార్యక్రమం: మండలంలోని లొల్ల, వెదురుపాక గ్రామాల్లో మంగళవారం సూపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల ఇంటింటా పర్యటిస్తారని ఆయా గ్రామాల టీడీపీ నాయకులు తెలిపారు. లొల్లలో ఉదయం 9 గం టలకు, వెదురుపాకలో ఉదయం 10కి పర్యటించి అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తారని టీడీపీ నాయకుడు కొవ్వూరి చంటిరెడ్డి తెలిపారు.

కూటమిపాలనపై ప్రజలు సంతృప్తి

మండపేట, (ఆంధ్రజ్యోతి): కూటమి పాలన పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చెప్పారు. మండపేట మండలం తాపేశ్వరం తోపాటు మం డపేటలోని 16, 20వ వార్డులో ఏడాదిలో సాధించిన విజయాలపై జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పాల్గొన్నారు. ఇంటింటా పర్యటించి ప్రజల అభిప్రాయాలు, పాలనపై అడిగి తెలుసుకున్నారు. మండపేట నియోజకవర్గంలో సాధించిన ప్రగతి, చేపట్టిన పనుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఆయన వెంట 16, 20వ వార్డు ఇన్‌చార్జిలు గనిశెట్టి బుజ్జి, ఎం.సూర్యప్రకాష్, వాదా ప్రసాదరావు, టీడీపీ తాపేశ్వరం గ్రామ టీడీపీ అధ్యక్షుడు నూని వీర్రాజు, ముత్యాల పట్టాభి, గోసాల ప్రసాద్, వాసంశెట్టి శ్రీనివాస్, టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి తాతారావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సురక్షితమైన పాలన టీడీపీతోనే సాధ్యమని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణంరాజు పేర్కొన్నారు. సోమవారం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు బొబ్బర్లంక, తాడిపూడి, పులిదిండి గ్రామాల్లో ఆయన పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ప్రభుత్వ పథకాలు, పాలనపై ప్రజాభిప్రాయాలను తెలుసుకుని యాప్‌లో నమోదు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పరిపాలనపై చేపట్టాల్సిన కార్యక్రమాలపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. బొబ్బర్లంకలో నరాలశెట్టి వెంకన్న, దాసరి గణేష్ ఆధ్వర్యంలో పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రామకృష్ణంరాజును సత్కరించారు. ర్యాలీలో పార్టీ ముఖ్యనేతలు మద్దూరి సుబ్బారావు, మాజీ సర్పంచ్ పేరిచర్ల పుల్లంరాజు వర్మ, పార్టీ గ్రామ అధ్యక్షుడు పెండెం వెంకన్న తదితర నాయకులు తొలిఅడుగు సుపరిపాలనలో ప్రజాభిప్రాయాలను తెలుసుకున్నారు.



కె.గంగవరం మండలం బాలాంత్రంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న మంత్రి సుభాష్



మండపేటలో తొలి అడుగు కార్యక్రమంలో కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల తదితరులు



ఆర్డీవో కార్యాలయంలో సమస్యలు వింటున్న జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

అర్జీల పరిష్కారంలో అధికారుల అలసత్వాన్ని సహించం

జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రజల అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహిస్తే సహించబోనని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం రామచంద్రపురం ఆర్డీవో కార్యాలయంలో పీజీఆర్ఎస్‌లో పాల్గొని ప్రజల అర్జీలు స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారం లభిస్తుందన్న ఆశతో ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఆశ్రయిస్తున్నారని అన్నారు. వారి నమ్మకానికి బలం చేకూర్చేలా అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపవలసిందేనని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎవరైనా అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని అధికారులకు హెచ్చరిక జారీ చేశారు. అర్జీల పరిష్కారంపై ప్రతీవారం సమీక్ష నిర్వహిస్తామన్నారు. అర్జీల పరిష్కారంలో కారణం లేకుండా జాప్యం జరిగినా, నాణ్యత లేకున్నా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో దేవరకొండ అఖిల, పరిపాలనాధికారి భాస్కరరావు, డీఎల్‌డీవో విజయలక్ష్మీ, డివిజన్, మండలస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, జూలై 7(ఆంధ్రజ్యోతి): మారుతున్న వ్యవసాయ విధానాలకు అనుగుణంగా రైతులు యాంత్రీకరణ వైపు అడుగులు వేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. రైతులను వ్యవసాయం వైపు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం జరిగిన వ్యవసాయ పనిముట్లు పిచికారీ చేసే డ్రోన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయ అధికారి కె.ప్రభాకర్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వేగుళ్ల హాజరయ్యారు. మండపేట, రాయవరం మండలాలకు మంజూరైన రెండు డ్రోన్లను రైతు సంఘాలకు అందించారు. మండల పరిషత్ కార్యాలయంలో డ్రోన్లను ఎగురవేసి ట్రయల్ వేశారు. కార్యక్రమంలో రైతు గూపు సభ్యులతోపాటు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, మండల వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, ఎంఎసి చైర్మన్ చచ చింతపల్లి రామకృష్ణ, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు యరగతపు బాబ్జి, మండల పరిషత్ డిప్యూటీ ఎంపీడీవో దాసరి శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌వోసీ అందచేస్తున్న మంత్రి సుబాష్

కాలేయ మార్పిడికి సీఎం సహాయనిధిసాయం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 7 (ఆంధ్రజ్యోతి): కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.10 లక్షల చెక్కును మంత్రి సుభాష్ సోమవారం బాధితునికి అందచేశారు. రామచంద్రపురం మండలం ఉట్రుమిల్లికి చెం దిన గాదంశెట్టి లక్ష్మీనారాయణ కాలేయ వ్యాధితో బాధపడుతున్నాడు. మంత్రిని కలసి తన ఆర్థిక పరిస్థితి వివరించారు. దీంతో ఆయన సిఫార్స్‌తో సీఎం సహాయనిధి నుంచి రూ.10 లక్షలు మంజూరు చేస్తూ ఎల్‌వోసి జారీ చేయగా, బాధితునికి దాన్ని అందచేశారు.

డంపింగ్ యార్డు నిర్వహణ ప్రజారోగ్యానికి కీలకం

• రామచంద్రపురంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన • బాలికల హాస్టల్, అన్న క్యాంటీన్ పరిశీలన

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై7(ఆంధ్రజ్యోతి): డంపింగ్ యార్డు నిర్వహణ పర్యావరణ పరిరక్షణకు, ప్రజారోగ్యానికి కీలకమని జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని బైపాస్ రోడ్డు వద్ద ఉన్న డంపింగ్‌యార్డును ఆయన పరిశీలించారు. డంపింగ్ నిర్వహణ సరిగా లేకపోతే వాటి వల్ల అనేక సమస్యలతో పాటు ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతాయన్నారు. పేరుకుపోయిన చెత్తను లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ చేసి దాని నుంచి మట్టి, ప్లాస్టిక్, ఇతరాలు వేరు చేసే ప్రాసెసింగ్ పరికరాన్ని పరిశీలించారు. ప్రాసెసింగ్ ఏజెన్సీ కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. పురపాలక సంఘంలో రోజుకు ఎంతమేర చెత్త సేకరిస్తారని కమిషనర్ కేవీఆర్ రాజును అడిగి తెలుసుకున్నారు. డంపింగ్ యార్డు నుంచి క్రిమికీటకాలు వ్యాప్తి చెందకుండా క్రిమి సంహారక చర్యలు చేపట్టాలన్నారు. జనవాసాలకు దుర్గంధం వ్యాప్తి చెందకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు.

దోమలమెస్‌లు ఏర్పాటు చేయండి: ప్రైవేటు భవనంలో కొనసాగుతున్న జ్యోతిరావుపూలే బాలికల సంక్షేమ వసతిగృహాన్ని కలెక్టర్ సందర్శించారు. గుమ్మాలు, కిటికీలకు దోమలు రాకుండా మెస్సులు వేయాలని ఆదేశించారు. వసతి పొందుతున్న బాలికలకు మున్సిపల్ పార్కులో కొంత స్థలం కేటాయించి క్రీడా ప్రాంగణంగా మార్చాలని ఆదేశించారు.

అన్నక్యాంటీన్ తనిఖీ: మెయిన్ రోడ్డులో ఉన్న అన్న క్యాంటీన్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. క్యాంటీన్‌లోని పలు అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. భోజనం నాణ్యత, సంతృప్తిపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. నిరుపేదల కడుపు నింపే అన్నక్యాంటీన్లను తిరిగి ప్రారంభించడంతో వారి కళ్లలో ఆనందం కనిపిస్తున్నదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మృత్యుంజయరావు, బీసీ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్‌లో టోకెన్ల జారీని పరిశీలిస్తున్న కలెక్టర్

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

ఆత్రేయపురం, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవంతో పాటు, మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను సోమవారం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మర వీరరాఘవ, ఎంఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం యాకోబ్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ పతాకాలను ఎగురవేసి ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ముదునూరి వెంకట్రాజు, ముళ్ళపూడి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. ఆత్రేయపురం, మెర్లపాలెం, లొల్ల, వాడపల్లి, పేరవరం, కట్టుంగ, వెలిచేరు, అంకంపాలెం తదితర గ్రామాల్లో దండోర ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ పుట్టినరోజు వేడుకల సందర్భంగా నాయకుడు క్రాప నాగరాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు అధికారి నాగును సత్కరించారు. పాఠశాలలోని విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.

రాయవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు సోమవారం నిర్వహించారు. రాయవరంలో జరిగిన కార్యక్రమంలో తొలుత మందకృష్ణమాదిగ పుట్టిన రోజును పురస్కరించుకుని కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. ఈసందర్భంగా వర్గీకరణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, గొట్టుముక్కల రాజు తదితరులతో పాటు ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు ఎమ్మార్పీఎస్ నాయకులు కముజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాత బస్టాండ్ సెంటర్లో కేక్‌ను కూటమి నాయకులతో కలిసి వేడుకలు జరిపారు. అనంతరం టీడీపీ నాయకులను సత్కరించారు. కార్యక్రమంలో ముత్యాల బాబ్జి, కె.శ్రీను, ఉపసర్పంచ్ వి.మారుతీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణ

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం గ్రామంలో మాదిగసేన సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. దళిత నాయకులు మల్లిపూడి శివకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శివకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తొలుత జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో పలివెల వెంకట్రావు, ముమ్మిడివరపు పెదసత్యం, పలివెల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోటిపల్లి వద్ద పెరుగుతున్న గోదావరి వరద

కె.గంగవరం, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదనీటితో కోటిపల్లి వద్ద గోదావరి వరద ఉధృతి పెరిగింది. కోటిపల్లి పుష్కరాల రేవులో మెట్ల వరకు వరద నీరు చేరుకుంది. సోమవారం రామచంద్రపురం ఆర్‌డీవో డి.అఖిల గోదావరి ఉధృతిని పరిశీలించారు. సుందరపల్లి వద్ద బలహీనంగా ఉన్న ఏటిగట్టు వద్ద వరద పరిస్థితిని సమీక్షించారు. వెంటనే రక్షణ చర్యలకు కావల్సిన ఇసుక బస్తాలను సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట తహశీల్దార్ శ్రీరామ్ ప్రసాద్, ఆర్ఐ వెంకట్రావు, వీఆర్‌వో స్వామి నాయకుడు, ఇన్వర్వెన్సీ అధికారులు ఉన్నారు.



కె.గంగవరం మండలం సుందరపల్లి వద్ద ఏటిగట్టను పరిశీలిస్తున్న ఆర్‌డివో అఖిల

క్రమంగా పెరుగుతున్న గోదావరి వరద

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరికి వరదనీరు క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం ఎర్రనీరుతో గోదావరి నిండుగా కనిపించడంతో జొన్నాడ బ్రిడ్జిపై ప్రయాణించే వాహనదారులు కొద్దిసేపు ఆగి ఆసక్తిగా తిలకిస్తున్నారు. పుష్కర్ ఘాట్ వద్ద గోదావరి నీటిలో పలువురు మహిళలు ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

రావులపాలెం, జూలై 7(ఆంధ్రజ్యోతి): గోపాలపురం జాతీయ రహదారిపై రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. జాతీయ రహదారిపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేస్తున్న సమయంలో సోమవారం సిద్దాంతం వైపు నుంచి రావులపాలెం వైపు వస్తున్న మినీ వ్యాన్‌ను తనిఖీ చేశారు. వ్యాన్‌లో 60 బస్తాల్లో మూడు టన్నుల రేషన్ బియ్యం ఉండటాన్ని గుర్తించారు. బిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న కారణంగా బియ్యంతో పాటు వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని, పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ సీఐ మధుబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆలమూరు ఎస్‌ఐగా నరేష్ బాధ్యతల స్వీకరణ



ఆలమూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఆలమూరు సబ్ ఇన్‌స్పెక్టర్‌గా జి.నరేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా క్రైమ్‌లో బాధ్యతలు నిర్వహిస్తున్న ఈయనను ఆలమూరు ఎస్‌ఐగా నియమించారు. ఇక్కడ పనిచేస్తూ ఎస్‌ఐ ఎం.అశోక్ ఒక కేసులో నిందితులను అరెస్టు చేయడానికి హైదరాబాద్ వెళుతుండగా కోదాడ వద్ద రోడ్డు ప్రమాదం జరిగి మృతి చెందడంతో ఖాళీ ఏర్పడింది. జిల్లా ఎస్పీ ఆదేశాలతో నరేష్‌ను ఇక్కడ ఎస్‌ఐగా నియమించారు. ఎస్‌ఐ బాధ్యతలు స్వీకరించిన నరేష్‌ను పలువురు నాయకులు, అధికారులు అభినందించారు.

స్వచ్ఛ భారత్‌పై అవగాహన సదస్సు

ఆలమూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఓఎన్జీసీ చేపడుతున్న అవగాహన సదస్సును ఆలమూరు మండలం సంధిపూడిలో నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛ భారత్ లక్ష్యంగా ఓఎన్జీసీ సహకారం అందిస్తుందని సంస్థ ప్రతినిధులు కె.శ్రీకృష్ణ, బి.శివకుమార్ తెలిపారు. సర్పంచ్ తోట భవానీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్వచ్ఛ భారత్-స్వచ్ఛ సేవ కార్యక్రమాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. తడిపొడిగా చెత్తను వేరు చేసి సంపద సృష్టించేందుకు ఓఎన్జీసీ సహకారం అందిస్తుందని వారు వివరించారు. జూట్‌తో తయారు చేసిన సంచులను గ్రామస్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తోలేటి సంతోషి, కూటమి నాయకులు తోట వెంకటేశ్వర్లు, దొడ్డా సుబ్బారావు, నల్లా వెంకన్న, సూరపురెడ్డి పట్టాభిరామయ్య, సిద్దిరెడ్డి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జొన్నాడ వద్ద ఇసుక నిల్వలను పరిశీలించిన ఆర్డీవో

ఆలమూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం జొన్నాడ వద్ద నిల్వ చేసిన ఇసుక నిల్వలను సోమవారం కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ పరిశీలించారు. ముందుగా ఆయన జొన్నాడ ఇసుక ర్యాంపును పరిశీలించి అనంతరం రెండు ప్రాంతాల్లో నిల్వ చేసి ఇసుకను సందర్శించి వాటి అమ్మకాలపై ఆరా తీశారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండేందుకే ఇసుక నిల్వలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ కెజె.ప్రకాష్ బాబు, ఎంపీడీవో ఎ.రాజు, మండపేట రవాణా శాఖాధికారిని శ్రీదేవి, మండల పరిషత్ ఏవో మోహర్‌ప్రకాష్, పలువురు రెవెన్యూ, సర్వేయర్లు పాల్గొన్నారు.

షిర్డీసాయి ఆలయంలో గురుపౌర్ణమి ఉత్సవాలు

రావులపాలెం, జూలై 7(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలో షిర్డీసాయిబాబా ఆలయాల్లో 10న గురుపౌర్ణమి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ చైర్మన్ పి.కనికిరెడ్డి తెలిపారు. గురుపౌర్ణమి ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం బాబా ఆలయంలో కాగడ హారతి, అభిషేకం, సత్యవ్రతాలు, హైదరాబాద్‌కు చెందిన జ్యోతిర్మయి వారిచే ప్రవచనాలతో పాటు పల్లకి సేవ నిర్వహించనున్నారు.

ప్రయాణికుల సౌకర్యాలకు కృషి

రావులపాలెం, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణించే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు రావులపాలెం డిపో అసిస్టెంట్ మేనేజర్ ఎం.అచ్యుతాంబ అన్నారు. కాంప్లెక్స్‌లో ఐరన్‌కు ర్లీలు, ఫ్యాన్లు ఏర్పాటు చేశామన్నారు.